

గుంటూరు అష్టలక్ష్మి ఆలయంలో..



రేపల్లె: నాగదేవి అలంకరణలో బూరుగులమ్మ

## వరలక్ష్మీ వ్రతాలు.. పూజలు

శ్రావణ మాసం మూడో శుక్రవారం రోజు మహిళలు వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. వ్రతాలు.. పూజలతో వాడవాడ లా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయా లు, ఇళ్లల్లో కూడా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు చేసుకుని అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు పంచా మృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో నిర్వహించిన శ్రావణమాస పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



ప్రత్యేక అలంకరణలో చందోలు బగళాముఖి అమ్మవారు



# రూపు రేఖలు మారుతున్నాయి!

జాతీయ రహదారి 167(ఏ)తో నూతన శోభ



పర్చూరు వద్ద రూపుదిద్దుకుంటున్న వాడరేవు - పిడుగురాళ్ల హైవే

- ప్రధాన మార్గంలోకి వస్తున్న గ్రామాలు
- కనుమరుగు అవుతున్నవి మరికొన్ని...

పర్చూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - పిగుడురాళ్ల జాతీయ రహదారి 167(ఏ) నిర్మాణంతో పరిసర గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. కొన్ని ప్రధాన రహదారి పక్కనే కళకళలాడుతుండగా.. మరి కొన్ని రహదారి నిర్మాణంతో.. కనుమరుగు అవుతున్నాయి. రహదారి నిర్మాణంతో పర్చూరుకు ప్రాధాన్యత తగ్గే పరిస్థితి నెలకొంది. తెలంగాణ, రాజధాని, వాడరేవు తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలతో ఇప్పటి వరకు ఈ ప్రాంతం కిటకిట లాడింది. హైవే వినియోగంలోకి వస్తే పర్చూరుకు వాహనాల రాకపోకలు అత్యధిక శాతం తగ్గుతాయి. దీని ప్రభావం పలు వ్యాపారాలపై పడుతుందని అంచనా. మరో వైపు హైవే నిర్మాణంతో సాధారణ వ్యవసాయ భూముల ధరలకు సైతం రెక్కలొచ్చాయి.

పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం అభివృద్ధి చెందే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటి వరకు ప్రధాన రహదారి పక్కన ఉన్న తిమ్మరాజుపాలెం గ్రామం నుంచి రాకపోకలు సాగుతున్నాయి. రహదారి అగ్రహారం మీదుగా వెళ్లడంతో.. పాత రోడ్డు వెలవెల పోనుంది. అన్నంబొట్లవారిపాలెం సమీపంలో రోడ్డు నిర్మాణం జరగటంతో ఆ గ్రామం రూపురేఖలు మరింతగా మారనున్నాయి. రెవెన్యూ కార్యాలయం సమీపంలోని ఉప్పుటూరు వద్ద హైవేకు అనుసంధానం చేస్తూ అండర్ బ్రిడ్జి నిర్మాణంతో ఆ గ్రామం నూతన కళను సంతరించుకోనుంది. నిన్న మొన్నటి వరకు గ్రామీణ రోడ్లకు పరిమితం అయిన గ్రామాలు నేడు జాతీయ రహదారి రాకతో.. మరింత అభివృద్ధి చెందనున్నాయి.



పర్చూరు - చిలకలూరిపేట రోడ్డులో దేవరపల్లి వద్ద హైవే రోడ్డు నిర్మాణానికి ముందు ఉన్న రోడ్డు... ఇప్పటి రోడ్డు

# అంతన్నారు.. ఇంతేనా?

చివరి ఆకు వరకు కొంటాం.. ఎవరూ ఆందోళన చెందొద్దు.. అధైర్య పడొద్దు.. అని పాలకుల హామీతో పొగాకు రైతుల్లో ఆనందం నెలకొంది. అయితే ఒక్కో రైతు దగ్గర 20 క్వింటాళ్లే కొంటామన్న ప్రభుత్వ తాజా ప్రకటనతో అయోమయం.. ఇంతలోనే 30 క్వింటాళ్లు తీసుకు రమ్మంటూ రైతుల సెల్‌ఫోన్లకు మార్క్‌ఫెడ్ నుంచి మెసేజ్‌లతో రైతుల్లో గందరగోళం. మొత్తం మీద పొగాకు కొనుగోళ్లకు సంబంధించి అసలు ఎంత పరిమాణంలో కేంద్రా లకు తీసుకు వెళ్లాలో అర్థం కాక రైతులు కలవరం చెందుతున్నారు. ఫోన్లకు వచ్చిన మెసేజ్ ప్రకారం కేంద్రాలకు పొగాకు తీసుకెళ్తే అక్కడ కొనుగోలు చేయకపోవడంతో మళ్లీ ఇళ్లకు తీసుకువచ్చేందుకు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని అదనుగా తీసుకున్న కంపెనీలు తాము చెప్పిందే రేటుగా చెలరేగి పోతున్నాయి. ఈ గందరగోళంతో ప్రభుత్వంపై తొలుత వచ్చిన సానుకూలత.. జరుగుతున్న పరిణామాలతో కొంతవ్యతిరేకతగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.



బాపట్ల కొనుగోలు కేంద్రం వద్ద పొగాకు బేళ్లతో బారులు తీరిన ట్రాక్టర్లు (పాత చిత్రం)

- పరిమితి ప్రకటనతో రైతుల్లో అసహనం
- రైతులకు వస్తోన్న మెసేజ్‌లపైనా అస్పష్టతే
- 20 క్వింటాళ్ల నిర్ణయం కంపెనీలకు వరమయ్యేనా?

### వ్యూహాత్మకంగా కంపెనీలు..

పొగాకు కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగగానే సమాంతరంగా అంతోఇంతో కంపెనీలు కూడా దాదాపు అదే ధరకు బర్లీని కొంటూనే వస్తున్నాయి. కానీ ప్రభుత్వం తీసుకున్న పరిమితి నిర్ణయంతో మార్కెట్ నుంచి తాత్కాలికంగా వారు వైదొలిగారనేది సమాచారం. మార్క్‌ఫెడ్ కొనగా మిగిలింది కంపెనీల చేత కొనుగోలు చేయిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యే కదా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించింది. మళ్లీ అవే మాటలు ప్రభుత్వం చెప్పడాన్ని రైతులు విశ్వసించడంలేదు. పరిమితి నిర్ణయం కంపెనీలకు వరంలా మారే అవకాశం ఉందనేది ట్రేడ్‌వర్గాల అంచనా.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

చివరి ఆకువరకు కొంటానని చెప్పి ప్రభుత్వం బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోళ్లను ప్రారంభించింది. నాలుగు జిల్లాల పరిధిలో మార్క్‌ఫెడ్ ఇప్పటికే 11,100 మెట్రిక్ టన్నుల బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. అయితే అంతా సవ్యంగా సాగిపోతోంది అనుకునేంతలో ఒక్కో రైతు దగ్గర 20 క్వింటాళ్లే కొంటామంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పొగాకు రైతులను కలవరపెడుతోంది. మిగిలిన పొగాకును కంపెనీల చేత కొనే ఏర్పాటు చేయిస్తామనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అయితే అధికారులు మాత్రం 30 క్వింటాళ్ల తీసుకురమ్మంటూ రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. దీంతో 30 క్వింటాళ్లతో కొనుగోలు కేంద్రాలకు చేరుకుంటున్న రైతులు మిగిలిన పది క్వింటాళ్లను తిరిగి తీసుకెళ్లాల్సి వస్తోంది. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తాజాగా పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు ప్రకటించారు. కానీ ఈ విషయంలో రైతుల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది.

> మీ పొగాకు పంట మద్దుతు ధర ( HDR 120 Rs /కే జి , HDM 90 Rs /కే జి , HDX 60Rs /కే జి ) తో కొనుగోలు కేంద్రం వారు BAPATLA (జిల్లా) , KARAMCHEDU (మ) ,JARUBULAVARIPALEM , ADIPUDI PACS కొనుగోలు కేంద్రం వారు రైతు సేవా కేంద్రం వద్ద 05-AUG-2025నాడు నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయదరు. మీ నమోదు సంఖ్య: CM21846066. మీ కొనుగోలు పరిమితి : 30 క్వింటాల్ వరకు. ధన్యవాదాలు. -GOVTAP

30 క్వింటాళ్ల వరకు కొనుగోలు పరిమితి అని ఓ రైతు సెల్‌కు వచ్చిన మెసేజ్

### సమన్వయం.. సన్నద్ధత లోపాలు

అయా విభాగాల మధ్య సమన్వయ లోపంతో పాటు కొనుగోళ్లపై ముందస్తు సన్నద్ధతలో లోటుపాట్లు బర్లీ రైతులను కలవరపెడు తున్నాయి. రైతుల వద్ద (మిగతా 6వ పేజీలో)

# ఉపాధి అక్రమాలు.. రూ.2.04 కోట్లు!

- మరో రూ.1.10 కోట్ల పనులపై క్వాలిటీ కంట్రోల్ తనిఖీ..
- తవ్వేకొద్దీ వెలుగు చూస్తున్న అవకతవకలు
- అర్ధరాత్రి వరకు బల్లికురవలో మండల ప్రజా వేదిక
- పెద్ద ఎత్తున కూలీల సొమ్ము స్వాహా..

బల్లికురవ/అద్దంకి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో భారీ గా అక్రమాలు వెలుగు చూశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం సోషల్ ఆడిట్ బృందం ప్రజావేదికలో తనిఖీ వివరా లు వెల్లడించింది. వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన క్షేత్ర స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించి, అక్రమాలకు పాల్పడినట్లు తేటతెల్లమైంది. ప్రజా వేదిక లైవ్ ఆడిట్ రెండు రోజుల పాటు కొనసాగింది. అంగన్వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కూడా మస్టర్లు వేశారని విమర్శలున్నాయి. ఒకే పనిని రెండు మూడు సార్లు మార్పు చేసి చూపించినట్లు నిర్ధారణ అయింది. ఉపాధి హామీ పథకంలో రూ.12 కోట్ల విలువైన పనులు జరగగా.. తనిఖీ బృందాలు రూ.4 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు గుర్తించాయి. చివరిగా రూ.2,04,78,000 అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. మరో రూ.1.10 కోట్ల అక్రమాలకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ బృందం పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.

- గ్రామాల వారీగా పరిశీలిస్తే.. వి.కొప్పెరపాడులో రూ.50 లక్షలు, అంబడిపూడిలో రూ.49.33 లక్షలు, ఉప్పమాగు లూరులో రూ.39.67 లక్షలు, ముక్తేశ్వరంలో రూ.35 లక్షలు, బల్లికురవలో రూ.12 లక్షలు, వల్లాపల్లిలో రూ.1.57 లక్షలు, మల్లాయపాలెంలో రూ.8 లక్షలు, వెలమవారిపాలెంలో రూ.1.04 లక్షలు, వైదనలో రూ.3.78 లక్షలు, కొప్పెరపాలెంలో రూ.8.30 లక్షలు, కొమ్మినేనివారిపాలెంలో రూ.96 వేలు, వేమవరంలో రూ.80 వేలు, గుంటుపల్లిలో రూ.65 వేలు, కొణిదెన లో రూ.16వేలు, చెన్నుపల్లిలో రూ.16 వేలు, గొర్రెపాడులో రూ.4,800లు అ క్రమాలు జరిగినట్లు గుర్తించారు.



ప్రజావేదికలో వివరాలను తెలుసుకుంటున్న జిల్లా పీడీ విజయలక్ష్మి

### మరోసారి తనిఖీ చేయాల్సిన గ్రామాలు

నక్కబొక్కలపాడు రూ.24 లక్షలు, కొమ్మినేనివారిపాలెంలో రూ.12 లక్ష లు, వేమవరంలో రూ.20 లక్షలు, అంబడిపూడిలో రూ.1.61 లక్షలు, కొణిదెనలో రూ.7 లక్షలు, చెన్నుపల్లి రూ.2.70 లక్షలు, గొర్రె పాడులో రూ.14.63 లక్షలు, వల్లాపల్లిలో రూ.6.38 లక్షలు, కె.రాజుపాలెంలో రూ.5 లక్షలు, కూకట్లపల్లిలో రూ.8 లక్షలు, వెలమవారిపాలెంలో రూ.8.80 లక్షలకు సంబంధించి కొన్ని పనులను క్వాలిటీ కంట్రోల్ బృందం తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.



8

# కలవరపెడుతున్న సుంకం

- సందిగ్ధంలో ఆక్వా రైతులు
- అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం
- ఇతర దేశాలకు ఎగుమతులపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే వేగేశన
- చర్చలతో పన్ను తగ్గించాలి: వ్యాపారులు

# జిల్లాలో 18 డెంగీ కేసులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి ● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటి వరకు జిల్లాలో 18 డెంగీ కేసులు నమోదయ్యాయి.. సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి..' అని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాలు జారీ చేశారు. జ్వరాలపై శుక్రవారం ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటుందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతీ గ్రామంలో ఫాగింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని, వారంలో ఒకరోజు డ్రైడేగా పాటించి నీటి నిల్వలను తొలగించాలన్నారు. జ్వర సర్వేలు నిరంతరం కొనసాగించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, ఐవీఫ్లూయిడ్స్, మంచాలు ముందస్తుగా సిద్ధం చేయాలని చెప్పారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలని చెప్పారు. సంక్షేమం హస్టళ్లలో దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వైద్యసిబ్బంది ప్రతి డెంగీ కేసును ఖచ్చితంగా నివేదించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందన్నారు. సెలవుదినాల్లో కూడా అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీపీవో ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

# చీరాలలో గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చీరాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యక్తిగత పర్యటన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం వాడరేవు ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్‌డూడీ, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మర్యాద పూర్వకంగా గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం తిరిగి గవర్నర్ రాజ్‌భవన్‌కు చేరకుంటారని అధికారులు తెలిపారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ సేఫ్ హాస్పిటల్ నిర్వహించారు.

# అరవింద వారధికి ముప్పు

చెంతనే విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు పట్టించుకోని అధికారులు

కొల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలతో మాకు పని లేదు... ఎక్కడైనా తవ్వేస్తాం... ఏదైనా చేసేస్తాం... అన్న రీతిలో ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసినప్పటికీ తవ్వకాల్లో కొన్ని నియమ నిబంధనలు పొందుపరిచింది. కానీ అక్రమార్కులు అవేమి మాకు వర్తించవు అన్నట్లు వంతెన వెంబడి అక్రమ తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి వద్ద నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నప్పటికీ లంక గ్రామాల ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారుల నుంచి ఎటువంటి స్పందన ఉండటం లేదని, ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే హడావుడి చేసి తరువాత అక్రమార్కులతో వారు కూడా జోడి కట్టి తమ పనులు చక్కబెట్టుకుంటున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఇటీవల కృష్ణానదికి వరద నీరు పోటెత్తడంతో వారధి వద్ద ఇసుక తవ్వేందుకు అనుకూలంగా లేకపోవడంతో చింతల్లంక గ్రామం వద్ద ఉన్న పెదరేవులో ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ట్రాక్టర్లు తిరిగే ప్రాంతం వద్ద ప్రభుత్వ పాఠశాల ఉండటం, ట్రాక్టర్ల రణగణ ధ్వనులు పాఠశాలలోని విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్ఐ, తన సిబ్బంది అరవింద వారధిపై నిఘా వేసి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్లను నిలువరించి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు వారధి వద్ద కాపలా ఉన్నారన్న విషయం తెలుసుకున్న మరి కొంత మంది ట్రాక్టర్ల నిర్వాహకులు ఇసుకను అన్‌లోడ్ చేసి ఖాళీ ట్రాక్టర్లతో నిష్క్రమించారు. కృష్ణానదిలో వరద నీరు కూడా చాలా వరకు తగ్గడంతో ఇసుక మేటలు బయట పడ్డాయి. దీంతో మళ్లీ అక్రమార్కులు అరవింద వారధికి పది మీటర్ల లోపే ఇసుక తవ్వకాలు చేపట్టారు.



అరవింద వారధి పక్కనే జరుగుతున్న ఇసుక తవ్వకాలు

# అంతన్నారు..ఇంతేనా?

(5వ పేజీ తరువాయి)

పెద్దఎత్తున బర్లీ నిల్వలు ఉన్నాయని తెలిసినా అందుకు తగ్గట్లు గిడ్డంగుల లభ్యత ఉందో లేదో తెలుసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న గోడౌన్లలో కొనుగోలు చేసిన బర్లీ నిల్వలను మార్క్‌ఫెడ్ ఉంచింది. ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు నిల్వలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. ఇప్పుడు గోడౌన్లను వెదకడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి, కొన్ని సందర్భాల్లో అయితే తేదీ మారే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ఉండేందుకే స్లాట్ సిస్టమ్ అని చెప్పిన మార్క్‌ఫెడ్ ఇప్పుడు చేతులెత్తేయడం కూడా రైతుల విమర్శలకు కారణమైంది. రెండే గ్రేడ్లు అని ముందు చెప్పిన మార్క్‌ఫెడ్ మూడుగా విభజించి కొనుగోలు చేయడంతో పాటు ధరల విషయంలో కూడా అదే రీతిన వ్యవహరిస్తోందనేది రైతుల ఫిర్యాదు. ఇలా అనేక బాలారిష్టాలతో రైతులు కలవరం చెందుతున్నారు.

## సత్వరం కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

గుంటూరు (విద్య) ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ (475) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎల్.మాణిక్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బీజే గాంధీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లు సుమారు 70శాతం మంది బోధిస్తున్నట్లు తెలిపారు. గతంలో అమలు చేసిన 12 నెలల రెన్యువల్ ఉత్తర్వులు తిరిగి పునరుద్ధరించి, 2024-25 మే నెల వేతనాలు విడుదల చేయాలని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ విద్యాశాఖలో ఎన్నికల నియమావళి కారణంగా నిలిపివేసినట్లు తెలిపారు.

## చేపల వేట సాగిస్తూ.. మత్స్యకారుడి మృతి

బాపటరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చేపలవేట చేస్తూ ప్రమాదవశాత్తు బోటు నుంచి జారీపడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చీరాల మండలం వాడరేవుకు చెందిన మత్స్యకారుడు మోకా పెద సోమయ్య (47) పిన్నిబోయినవారిపాలెం గ్రామ సమీపంలోని నాగరాజు కాల్వలో బోటుపై చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బోటు నుంచి కాల్వలోకి జారీపడిపోయాడు. స్థానిక మత్స్యకారులు సోమయ్య కోసం చాలా సేపు గాలించారు. కొన్ని గంటల తర్వాత వలకు సోమయ్య మృతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నార్త్ ఈస్టు లారీ ఓనర్స్..

## అసోసియేషన్ రద్దుకు నిర్ణయం

● డిపాజిట్లు సభ్యులకు దామాషా పద్ధతిన పంపిణీ

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసియేషన్‌ని రద్దు చేయాలని ప్రస్తుత పాలకవర్గం తీర్మానించింది. యూనియన్ పరంగా ఉన్న డిపాజిట్లను అసోసియేషన్ సభ్యులకు దామాషా పద్ధతిన పంపిణీ చేయాలని నిర్ణయించింది. శుక్రవారం బుడంపాడు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద అసోసియేషన్ నాయకులు, సభ్యులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశానికి దాదాపుగా 40 మంది సభ్యులు హాజరయ్యారు. ప్రధానంగా లారీ యజమానుల సమస్యలపై చర్చించారు. కిరాయిలు బాగా తగ్గిపోవడం వల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని, చార్జీలు పెంచుతామంటే అటు అధికారులు, ఇటు వ్యాపారులు అంగీకరించడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ ఉండి లాభం లేదని నిర్ణయానికి వచ్చి రద్దు చేస్తున్నామని పాలకవర్గ సభ్యులు తెలిపారు.

### స్వార్థ రాజకీయాల కోసం

## దళితులపై దాడులు: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు తన స్వార్థ రాజకీయాల కోసం దళితుల మీద దాడులు చేస్తూనే ఉన్నాడని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. దళితులను చిత్రహింసలకు గురిచేయడం, చంపడం, డోర్ డెలివరీ చేయడం వైసీపీ నేతలకు హక్కుగా మారిపోయిందని ఆయన విమర్శించారు. తిరుపతిలో పవన్ కుమార్‌ను అత్యంత దారుణంగా చిత్రహింసలకు గురిచేసి.. తనను ఎవరూ కొట్టలేదని అతనితోనే వీడియో చేయించడం, ఆ వీడియోని ఆధారంగా తన భర్త శుద్ధపూజ అని చెప్పటం వైసీపీ నేర నైజానికి నిదర్శనమన్నారు. చిత్రహింసలకు గురైన పవన్ కుటుంబ పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తం ఇలాంటి విషపు మొక్కలను వైసీపీ పెంచి పోషిస్తోందని ఆయన ఆరోపించారు.



# వారి ప్రతిభ..విభిన్నం

● ప్రారంభమైన దివ్యాంగ సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు



క్యాచ్ పడుతూ..

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వైకల్యం దాటిన వాటి ఆట.. క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకలగుంట మైదానంలో మూడు రోజుల దివ్యాంగులకు స్వర్ణాంధ్రా సెంట్రల్ జోన్ ఇంక్లూజివ్ క్రికెట్ కప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో ప్రకాశం, గుంటూరు జిల్లా జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 5 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. చేజింగ్‌కు దిగిన ప్రకాశం నిర్ణీత 16 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేయగలిగింది. రెండు పరుగుల స్వల్ప తేడాతో గుంటూరు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణా జిల్లాల జట్లు తలపడగా.. 8 వికెట్ల తేడాతో కృష్ణా జట్టు గెలించింది. ఈ పోటీలను కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, కన్వీనర్ నీరుకొండ లీలాకృష్ణారావు, సహాయకార్యదర్శి షేక్ నాగులమీరా, సురేష్ పర్యవేక్షించారు.



తలపడుతున్న ప్రకాశం, గుంటూరు జట్లు

# బూర్జువా పార్టీలను ఎదుర్కోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

వినుకొండటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో బూర్జువా పార్టీలు అధికారంలో ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు సీపీఐ భుజ స్కందాలపై ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ద్వితీయ మహా సభలు సందర్భంగా.. 2వ రోజు శుక్రవారం స్థానిక గంగినేని కల్యాణ మండపంలో జిల్లా ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ మహా సభల సందర్భంగా గత గురువారం నిర్వహించిన భారీ ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతమైందని తెలిపారు. ఒకనాడు పల్నాడు జిల్లా కక్షలకు, పంతాలకు నిలయంగా ఉండేదని.. నేడు పరిస్థితులు మారి అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ఈ సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లాలో కీలకంగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు కేంద్రంలో అమిత్‌షా తదితర ఎన్‌డీఏ నేతలు జాతి ద్రోహులను దగ్గరకు తీసుకుంటున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ.. కేంద్రంలో రాక్షస పాలన సాగుతోందని, అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంపై వారికి ఎటువంటి గౌరవం లేదని అన్నారు. మైనార్టీ సీట్లతో గెలిచిన మోదీ తొలుత జగన్మోహన్‌రెడ్డిని, అనంతరం చంద్రబాబునాయుడుని ఆశ్రయించాడని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహించిన ఆందోళనలు, ధర్నాలు, పలు కార్యక్రమాలుపై కార్యదర్శి నివేదికను సభలో చదివారు. ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వయ్యకంటి చెన్నకేశవరావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ. మారుతివరప్రసాద్, సంద్రపాటి సైదా, షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, బూదాల శ్రీనివాసరావు, మహంకాళి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, ఎం. రమణారెడ్డి, టి.బాబురావు, సత్యనారాయణరాజు, శ్రీనివాసరావు, రమేష్, కోటా మాల్యాద్రి, శారమ్మ, శరత్‌చంద్ర పాల్గొన్నారు.



సీపీఐ జెండా ఆవిష్కరించిన ముప్పాళ్ళ నాగేశ్వరరావు

# దొంగ దొరికాడు..

పొన్నూరుటౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఈ నెల 5న దుకాణాల్లో చోరీకి పాల్పడిన దొంగను శుక్రవారం అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ ఎల్ వీరనాయక్ విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్ సమీపంలోని దుర్గా పెయింట్ షాప్‌లో చోరీపై యజమాని షేక్ సాదిక్ బాష ఫిర్యాదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు భాగంగా గుంటూరు పట్టణానికి చెందిన మిక్కిలి సందీప్‌ను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం అరెస్టు చేసినట్లు చెప్పారు. దుకాణంలో చోరీ చేసిన రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో 18 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో నమోదయ్యాయని వెల్లడించారు. 9 సార్లు నిందితుడు జైలుకు వెళ్లి వచ్చి తిరిగి దొంగతనం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పది రోజుల క్రితం ఒంగోలు రూరల్ పరిధిలో రెండు కేసుల్లో రూ. 60 వేలు, స్కూటీ, పల్నాడు జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం చేసినట్లు చెప్పారు. మొత్తంగా రూ. 1,05,000 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో స్కూటీని కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. నేరం జరిగిన 36 గంటల్లో నిందితుడిని అరెస్టు చేసిన స్టేషన్ సీఐ వీరనాయక్ ఎస్ఐ శ్రీహరిని డీఎస్పీ జనార్దన్ రావు ప్రత్యేకంగా అభినందించారు.



దొంగను అరెస్టు చూపిస్తున్న అర్బన్ పోలీసులు

# ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

● దిగువకు 29 వేల క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 68,900 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 40 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 29 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 18,055 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

### పశ్చిమ డెల్టాకు 7713 క్యూసెక్కులు..

దుగ్గిరాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాకు ప్రకాశం బ్యారేజి నుంచి శుక్రవారం గరిష్ఠంగా 7,713 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజి వద్ద 12.0 క్యూసెక్కులనీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 300, రేపల్లె కాల్వకు 1861, తూర్పుకాల్వకు 702, పశ్చిమ కాల్వకు 277, నిజాంపట్నం కాల్వకు 449, కొమ్మమూరు కాల్వకు 3180 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

# జిల్లా జైలు నుంచి తురకా కిశోర్ విడుదల

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, రౌడీ షీటర్ తురక కిషోర్ శుక్రవారం జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కిషోర్ చేసిన నేరాలకు సంబంధించిన కేసుల్లో సుమారు 8 నెలలుగా ఆయన గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ లో ఉన్నారు. ఇటీవల ఆయన ఆయా కేసుల్లో బెయిల్ పై విడుదల కాగా టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నంకు సంబంధించి నమోదైన మరో కేసులో పోలీసులు అరెస్టు చేశారు. దీనిని సవాల్ చేస్తూ తురకా కిషోర్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నిందితుడు కిషోర్ ను వెంటనే విడుదల చేయాలంటూ ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం ఆయనను గుంటూరు జిల్లా జైలు అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా జైలు వద్దకు ఆయన భార్య, ఇద్దరు పిల్లలతో వచ్చారు. అదేవిధంగా వైసీపీకి చెందిన న్యాయవాదులు జైలు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అండగా నిలిచిన జగన్, అదేవిధంగా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలతో పాటు వైసీపీ లీడర్ సెల్ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా జైలు నుంచి విడుదలైన రౌడీషీటర్ తురక కిశోర్

### ఏపీఎల్‌లో..

## అమరావతి రాయల్స్ శుభారంభం

●కాకినాడ కింగ్స్‌పై మూడు వికెట్ల తేడాతో విజయం

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎల్ సీజన్-4 టోర్నీలో అమరావతి రాయల్స్ శుభారంభం చేసింది. ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ మూడు వికెట్ల తేడాతో కాకినాడ కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కాకినాడ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 229 పరుగులు చేసింది. కెప్టెన్ కేఎస్ భరత్ (93; 46 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లు), కేపీ రాహుల్ (96; 49 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లు) చెలరేగి రెండో వికెట్‌కు 183 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అమరావతి రాయల్స్ బౌలర్లలో బి.సంతోష్‌కుమార్ రెండు వికెట్లు పడగొట్టగా, యశ్వంత్, అయ్యప్ప చెరో వికెట్ తీశారు. అమరావతి రాయల్స్ బ్యాటింగ్‌కు దిగే సమయానికి వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. వర్షం తగ్గడంతో డీఎల్ఎస్ మెథడ్ ప్రకారం అమరావతి రాయల్స్‌కు 14 ఓవర్లలో 173 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించారు. అమరావతి రాయల్స్ 13.2 ఓవర్లలో ఏడు వికెట్లకు 173 పరుగులు చేసి అనూహ్య విజయం సాధించింది. కెప్టెన్ హనుమ విహారి (39), కరణ్ షిండే (28), పాండురంగరాజు (26), ఎవీవీ విజయ్ (30), అయ్యప్ప (12 నాటౌట్) రాణించి జట్టుకు అనూహ్య విజయాన్నందించారు. కాకినాడ కింగ్స్ బౌలర్ తపస్వి నాలుగు వికెట్లు పడగొట్టినా ఫలితం లేకపోయింది.

## గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం..

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఊరు పేరు తెలియని మృతదేహాలు రెండు నగరంలోని వేర్వేరు ప్రదేశాల్లో శుక్రవారం లభించాయి. 65 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి మృతదేహం.. కొత్తపేట, ఉమెన్స్ కాలేజీ రోడ్డులో బస్సు షెల్టర్ పక్కన కొత్త పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మార్చురీ ఎదురుగా పడి ఉండడంతో.. ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందాడు. మృత దేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని శవాగారంలో కొత్త పేట పోలీసులు భద్రపరిచారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 106, 114, 125 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 204.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 214.00 |

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దాచేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గురజాల మండలం అంబాపురం గ్రామా నికి చెందిన దోమతోటి బాజీ(27) పిడుగురాళ్ళలోని సున్న మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ద్విచక్ర వాహ నంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో దాచేపల్లిలోని సహజ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ అతనిని ఢీకొట్టింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలి ంచారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయం..

## పాలక మండలి నియామకానికి ఆహ్వానం

పెదకాకాని, ఆగస్టు 8( ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఆలయ ఉప కమిషనర్ జి.లీలా కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 20 రోజుల్లోగా తమ దరఖాస్తులను దేవస్థానంలో అందజేయాలని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### హైదరాబాద్ ఐఐటీతో విజ్ఞాన్స్..

## అవగాహన ఒప్పందం



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు (విద్య) ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వడ్ల మూడి విజ్ఞాన్స్ యూ నివర్సిటీ - హైదరా బాద్ ఐఐటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శుక్రవారం వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఐఐటీ - హైదరాబాద్ స్పాన్సర్డ్ కన్సల్టెన్సీ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జి.నరహరి శాస్త్రితో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఉమ్మడిగా పరిశోధనలు, డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవ చ్చునన్నారు. ప్రొఫెసర్ నరహరి శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యమన్నారు.

# గంజాయి ముఠా గుట్టు రట్టు

● తుమ్మలపాలెం వద్ద కేజిన్నర గంజాయి స్వాధీనం

ప్రత్తిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పరాయి రాష్ట్రం నుంచి ఇక్కడకు వచ్చి గుట్టుగా గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠా గుట్టును.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు రట్టు చేశారు. ముందస్తు పక్కా సమాచారంతో జాతీయ రహదారిపై ఉన్న తుమ్మలపాలెం గ్రామం వద్ద నిర్వహించిన దాడుల్లో కేజిన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారిని అడ్డాగా చేసుకుని.. వెంబడి ఉన్న విద్యాలయాలు, కంపెనీలను టార్గెట్ చేసకుని ఎంతో కాలంగా విక్రయాలు సాగిస్తున్నారు. టాస్క్ ఫోర్సు సీఐ బి.నయనతార ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సిబ్బంది తుమ్మలపాలెం గ్రామంలోని ఓల్డ్ బేరింగ్ కంపెనీ వద్ద దాడులు నిర్వహించారు. ఒడిశాకు చెందిన దీపక్ శెట్టి, పబాన్ బెహెర అనే ఇద్దరు పార్వతీపురానికి చెందిన లక్ష్మీ లతా మాలిక్‌తో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వీరి నుంచి 1,557 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసకుని.. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నయనతార తెలిపారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది నాంచారయ్య, నాగరాజు, చైతన్య, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

### పోలీసుల పేరు చెప్పి...

## రూ.50 వేలు ఫోన్ పే చేయించుకున్నారు!

● తల్లిదండ్రులకు సైబ్ నేరగాళ్ల టోకరా

ముప్పాళ్ళ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలేనికి చెందిన కిరాణా షాపు నిర్వాహకులు రూ.50 వేలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముప్పాళ్ళ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనుమల శెట్టి శ్రీనివాసరావు పద్మావతి దంపతులు కిరాణాషాపు నడుపుతుంటారు. ఈ నెల 6న మధ్యాహ్నం 98012 41475 అనే నంబర్ నుంచి శ్రీనివాసరావు ఫోనుకు కాల్ వచ్చింది. పద్మావతి ఫోన్ లిఫ్ట్ చేయగా ఫోన్ చేసిన వారు మాట్లాడుతూ 'మీ కుమారుడు బాలవెంకట సతీష్ ఒక అమ్మాయిని వేధిస్తూ.. పోలీసు కేసులో ఇరుక్కున్నాడు. మీ కుమారుడు అరెస్టు కాకుండా ఉండాలంటే మేము ఫోన్ చేసిన నంబర్‌కు రూ.50 వేల ఫోన్ పే చేయండి.' అని హెచ్చరించారు. దీంతో కంగారు పడిన పద్మావతి విషయాన్ని భర్తకు వివరించింది. బిడ్డ క్షేమం కోరిన వారు వెంటనే ఆ నగదును సదరు నంబర్‌కు ఫోన్ పే చేశారు. తర్వాత తమ కుమారుడు క్షేమంగానే ఉన్నాడని తెలుసుకుని విస్తుపోయారు. మోసపోయామని తెలుసుకుని ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ సైబర్ నేరగాళ్ళ పనేనని తెలిపారు. ఇటివంటి గుర్తింపులేని కాల్స్ వచ్చినపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ఎవరూ.. డబ్బుల అడగరనీ ఇటువంటి కాల్స్‌పై పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు.

## మహిళ మెడలో బంగారు ఆభరణాలు చోరీ

వినుకొండ టౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): గుడి నుంచి ఇంటికి నడిచి వెళుతున్న మహిళ మెడలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన వినుకొండ పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పీవీఆర్ గోల్డ్ షాపు యజమాని భార్య కొండమెట్ల సమీపంలోని సాయిబాబా దేవాయానికి వెళ్లి తిరిగొస్తోంది. బోసుబొమ్మ సెంటర్ వద్దకు రాగానే అక్కడ ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు ఆభరణాలు లాక్కొని పరారయ్యారు. మహిళ వెంటనే కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొన్నారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

చిలకలూరిపేట, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుండయ్య తోటలో రెండు రోజుల క్రితం విధి నిర్వహణలో ఉన్న పసుమర్రు సర్వేయర్ విద్యాసాగర్, పసుమర్రు వీఆర్వో కె.చంద్రశేఖర్, వీఆర్ఏ ఆశీర్వాదంపై జరిగిన దాడి కేసులో.. ముగ్గురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ పి.రమేష్ శుక్రవారం తెలిపారు. చల్లా శ్రీనివాసరావు, ఇద్దరు కుమారులను చిలకలూరిపేట కోర్టులో వారిని హాజరు పరిచగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

## సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 589.10 అడుగులు ఉంది. ఇది 309.35 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598, ఎడమ కాలువ ద్వారా 7373, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 43,999 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 43,999 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.52 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 41,880 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కుల నీరు, రెండు గేట్ల ద్వారా 34,578 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 51,578 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

# బాపట్ల వార్తలు





## దళిత యువకుడిపై భూమన కుటుంబం దాడిని ఖండిస్తున్నాం

● బావుడా చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పవిత్రమైన తిరుమల-తిరుపతిలో వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరులు దళిత యువకుడిపై చేసిన క్రూరమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బావుడా చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు అన్నారు. ఈ విషయంపై శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సలగల మాట్లాడుతూ వైసీపీశ్రేణులు చేసిన దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దౌర్జన్యం కాదని, ఇది దళిత సమాజం మీద చూపిస్తున్న దమనకాండకు నిదర్శనమన్నారు. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి స్పృహ కోల్పోయే విధంగా క్రూరంగా కొట్టారన్నారు. ఈ దారుణ ఘటన వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తూ బాధితులను భయపెడుతున్నారన్నారు. రౌడీయిజం చేయటం, ప్రెస్‌మీట్‌లు పెట్టి శుద్ధపూస స్టేట్‌మెంట్‌లు ఇవ్వటం భూమననైజమన్నారు. తిరుపతిలో రౌడీయిజం చేస్తూ తిరుమల పవిత్రతను దెబ్బతీసే కుట్ర నిత్యం చేస్తూనే ఉంటాడన్నారు. వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ అని ఆయన విమర్శించారు. అధికారం ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఈవిధంగా దళితులపై దాడులు చేయటం వారికే చెల్లుతుందన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సలగల రాజశేఖర్‌బాబు కోరారు.

## జగన్‌ను సీబీఐ ప్రశ్నిస్తే వివేకా హత్య గుట్టు రట్టు అవుతుంది : కొల్లా

బాపట్ల,ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య గుట్టురట్టు కావాలంటే సీబీఐ అధికారులు జగన్‌ను ప్రశ్నించాలని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి సుప్రీంకోర్టు వరకు వెళ్ళి న్యాయం చేయాలని కోరటం జరిగిందన్నారు. కావున జగన్మోహనరెడ్డిని ప్రశ్నించి వాస్తవాలు రాబట్టాలని కొల్లా కోరారు.

## విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● ఆర్డీవో గ్లోరియా

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాలలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. పట్టణంలోని అక్బర్‌పేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను శుక్రవారం అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో పాఠశాల ప్రాంగణంలో చేపట్టాల్సిన చర్యలు గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంటశాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించాలన్నారు. దోమలు వ్యాపించకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి క్యాన్‌లపై మూతలు పెట్టాలన్నారు. నీటి ట్యాంక్‌ల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి శుభ్రతపై పలు సూచనలు చేశారు.



అక్బర్‌పేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల కిచెన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా తదితరులు

## ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ అయినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మకర్తలమండల నియామకాన్ని నోటిఫికేషన్ కోరుతూ విజయవాడకు చెందిన దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయ సభ్యులు నుంచి శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. ఈనెల 8 నుంచి 20రోజులలోపు ఆసక్తి కలిగిన వారు నేరుగా తమ దరఖాస్తులను బాపట్ల జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు అమ్మవారి ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## జిల్లాల పేర్ల మార్పులో అమరవీరులను పరిగణనలోకి తీసుకోవాలి

● మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పేర్ల మార్పులో అమరవీరుల పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు కోరారు. ఈ విషయమై శుక్రవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన, జిల్లాల పేర్లు మార్పుటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కమిటీని వేసి నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయటం సంతోషదాయకమన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని మాజీ సైనికుల తరుపున స్వాగతిస్తున్నామన్నారు. జిల్లాల పేర్లు ఖరారు చేసే క్రమంలో దేశం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన జవాన్‌ల పేర్లను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సలహాదారులు సుంకర శేషగిరిరావు, అబ్దుల్ రజాక్, తాడివాకా రుక్మధరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు

## జిల్లా దివ్యాంగుల సంక్షేమ కార్యాలయం ప్రారంభం

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు దివ్యాంగుల విజ్ఞప్తితో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఏడీ సువార్త మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో గురు, శుక్ర, శనివారాలు దివ్యాంగుల సమస్యలు తెలుసుకోవటానికి, వినతిపత్రాలు అందుకోవటానికి అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘాల నాయకులు నర్రా రమేష్, గోగన ఆదిశేషు, పిట్ల శ్రీనివాసరెడ్డి, కంది వెంకటరెడ్డి, చల్లా రామయ్య, జోసఫ్, రామిరెడ్డి, బాలసుందర్, రాజశేఖర్, మౌలాలి, కొండలు తదితరులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా దివ్యాంగుల నాయకులను సన్మానించారు.

## మోదుకూరి రచనలు అజరామరం : రావూరి

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక తెలుగు నాటక రంగంలో మోదుకూరి జాన్సన్ రచించిన 'నటనాలయం' నాటకం ఒక సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించిందని, సినీ రచయితగా పలు చిత్రాలకు రచనలు చేసి అజరామరంగా నిలిచిపోయారని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బాపట్ల సాహితిభారతి ఆధ్వర్యంలో శుక్రవారం మోదుకూరి జాన్సన్ 89వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సభలో సాహితిభారతి కోశాధికారి ఆదం షఫి, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్ సంయుక్తంగా మాట్లాడుతూ మరో ప్రపంచం, దేశోద్ధారకుడు, మానవుడు, దానవుడు, సోగ్గాడు, ఇంద్రధనస్సు వంటి పలు చిత్రాలకు రచనలు చేశారని, దేవాలయం, హృదయాలయం వంటి నాటకాలు దక్షాభిషేకం అనే నవల, కాకినే కావ్యాన్ని కూడా రచించారన్నారు. కార్యక్రమంలో కీర్తి వెంకటేష్, దగ్గుమల్లి శామ్యూల్, కాళీదాసు కామరాజు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎం.జాకబ్‌లు జాన్సన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

## అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు చేయూత

కర్లపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎం.వి.రాజుపాలెంలోని ఒక నిరుపేద కుటుంబానికి 10 కిలోల బియ్యం శుక్రవారం అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, రిటైర్డ్ ఆర్మీ, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ బాషా, షేక్ ఇబ్రహీం, బహదూర్ బాషా, షేక్ హబీబ్, రియాజ్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌తో ప్రతి సమస్యకు పరిష్కారం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించి సమస్యలు నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాదర్బార్ ద్వారా ప్రజల ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధప్రాంతాలు నుంచి విచ్చేసిన ప్రజల సమస్యలను నమోదు చేసుకొని అర్జీలు స్వీకరించారు.

కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. మరికొన్నిటిని ఆయా శాఖల అధికారులకు విచారణ నిమిత్తం పంపించారు. రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో అనేక సమస్యలు ఉన్నట్లు బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్థల వివాదాలు, రహదారి సమస్యలు తెలియజేశారు. కేబుల్ ఆపరేటర్ల సంఘం వారు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వీటన్నిటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంధ్రేయ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



రేపల్లె పట్టణంలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న దంపతులు

రేపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎంతో పవిత్రమైన శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నియోజకవర్గంలోని పలుదేవాలయాల్లో, పలు గృహాల్లో వరలక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం, నల్లూరు శివాలయం, శారదాంబ దేవాలయంలో వరలక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు ప్రసాదాలను అందించారు.

### బాపట్లలో...

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసంలో అత్యంత విశేషమైనది వరలక్ష్మీ వ్రతం. శ్రావణమాసం పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఆచరించటం అనవాయితీ. బాపట్ల పట్టణంలోని శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, నరాలశెట్టివారిపాలెంలో అష్టలక్ష్మీ అమ్మవారికి, ఎస్ఎన్‌పి అగ్రహారంలో శ్రీగంగాపర్వతవర్ధిని అమ్మవారికి, చీలురోడ్డుసెంటర్‌లో అష్టలక్ష్మి, పోలేరమ్మతల్లి దేవాలయాలలో విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### కర్లపాలెంలో....



శ్రీకాళికమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన చిత్రం

కర్లపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని పలు దేవాలయాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవార్లకు, గ్రామదేవతలకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. కర్లపాలెంలోని శ్రీవీరభద్రస్వామి శ్రీకాళికమ్మ తల్లి దేవాలయంలో శ్రీకాళికమ్మతల్లి అమ్మవారిని, శ్రీపెద్దింటమ్మ అమ్మవారిని, ఎం.వి.రాజుపాలెంలో శ్రీరేణుక అంకమ్మతల్లిని, ఏట్రవారిపాలెంలో రెడంకమ్మతల్లిని, బుద్దాంలో పల్లాలమ్మతల్లిని, పేరలిలో పేర్లమ్మతల్లిని, చింతాయపాలెంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లిని, గణపవరంలో శ్రీఊర్లమ్మఅమ్మవారిని భక్తులు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలందరు నూతన వస్త్రాలు ధరించి శ్రావణమాస శోభకు శ్రీకారం చుట్టారు.

### చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నడింపల్లిలోని శ్రీరెడంకమ్మ అమ్మవారికి సారె ఇచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తుల అనేక మంది విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో...

భట్టిప్రోలు, కొల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని గ్రామాల్లో శ్రావణ శుక్రవారం వ్రత పూజలు భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడవ శ్రావణ శుక్రవారం లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరం కావడంతో మహిళలు తమ గృహాలను శుక్రవారం శ్రావణ శుక్రవార వ్రతాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి అన్నప్రసాదాలు నైవేద్యంగా సమర్పించి మహిళలకు వాయినాలు అందజేశారు.

### అమృతలూరులో...



ప్రత్యేక అలంకరణలో శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారు

అమృతలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మీ పూజలు జరుపుకున్నారు. పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం కావడంతో మహిళలు వరలక్ష్మీ వ్రతం చేసుకున్నారు. పలు ఆలయాల్లో అర్చక స్వాములు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

### శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో...

పిట్టలవానిపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళా భక్తులు, భక్తులు పాల్గొని అమ్మవారికి వరలక్ష్మీ పూజలు నిర్వహించుకున్నారు. శ్రీ బగళాముఖి అమ్మవారు వరలక్ష్మీ అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33కేవీ రేపల్లె ఫీడర్, 11కేవీ బొబ్బర్లంక ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డీఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి తూర్పువైపు ఉన్న ఏరియా మొత్తం, మండలంలోని పేటేరు, కారుమూరు, మోర్లవారిపాలెం, పెనుమూడి, రుద్రవరం, మోర్తోట, చాట్రగడ్డ, కామరాజుగడ్డ, బొబ్బర్లంక, చోడాయపాలెం, కైతేపల్లి గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో మరమ్మతుల దృష్ట్యా శనివారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శాంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మండల పరిధిలోని పెదపాలెం, పెదపులివర్రు, గొరికపూడి, ఓలేరు, కన్నెగంటివారిపాలెం, తూర్పుపాలెం, కొల్లిపర, పెదలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

## పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం



ఆరుంబాకలో డ్రైనేజీలో వేసిన చెత్త

చెరుకుపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరుంబాక పంచాయతీలో పారిశుధ్యం నిర్వాహణలో నిర్లక్ష్యం అడుగడుగునా కనబడుతుంది. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న ఈసమయంలో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా చేయకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం డ్రైనేజీలలో అడ్డంకులు తీయించి మురుగునీరు సక్రమంగా పారేటట్లు చేసి మురుగునీరు ఉన్న చోట బ్లీచింగ్ చల్లించాలని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదు.

## వైభవంగా మహాలక్ష్మీ అమ్మవారి మానుపూత ఉత్సవం



వేపమానుకు లక్ష్మీదేవి అలంకారం

వేమూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి 153వ మానుపూత ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం అర్చకులు సదాశివశాస్త్రి పంచ సూక్తాలతో వేపమానుకు, మూలవిరాట్ విగ్రహానికి పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు, పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. విశేష పూజలు అనంతరం గ్రామంలో అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు భజన సంఘాల వారు కోలాట భజన ప్రదర్శన చేశారు. వివిధ భజన సంఘాల వారు భజన కీర్తనలు ఆలపించారు. మేళతాళాలు, బాణాసంచా మధ్య అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. మండలంలోని గ్రామాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా హిందూ సాంప్రదాయబద్ధంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు జరుపుకున్నారు. కుచ్చెళ్లపాడులో భజన సంఘాల వారు నిత్య హనుమాన్ చాలీసా పారాయణ, లలితా సహస్రనామ స్తోత్రం, విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణ నిర్వహిస్తున్నారు.

## ఓటు హక్కు హరించే ఎస్ఐఆర్‌ను తొలగించాలి

రేపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బీజేపీ అడ్డదారుల్లో అధికారంలోకి రావటానికి ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ద్వారా తమకు కావాల్సిన చోట దొంగ ఓట్లు చేర్చుకోవటం, ఓట్లు తొలగించటం చేస్తున్నారని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ ఆరోపించారు. స్థానిక అంబేద్కర్ భవనం వద్ద పౌరుల ఓటు హక్కును హరించే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, డి.శ్రీనివాస్, వైనవీన్, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

## కన్నకూతుర్ని అమ్మేశాడు

● రూ.5 వేలకు కొనుక్కున్న ఇద్దరు వ్యక్తులు
● చాకచక్యంగా పట్టుకున్న జీఆర్పీ పోలీసులు
● తండ్రి సహా ముగ్గురు అరెస్టు



అపహరణకు గురైన చిన్నారితో జీఆర్పీ పోలీసులు

విజయవాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కన్నకూతుర్ని రూ.5 వేలకు అమ్మేశాడు ఓ తండ్రి. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లాలోని వేటపాలేనికి చెందిన సైకం మస్తాన్ గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో తన మూడేళ్ల కుమార్తె శ్రావణిని విజయవాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నెంబర్ 1లోని రిజర్వేషన్ కౌంటర్ నుంచి ఎవరో అపహరించారని జీఆర్పీ పోలీసులకు తెలిపాడు. దీంతో జీఆర్పీ సీఐ రమణ రైల్వేస్టేషన్ బయట, పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు పాపను ఓ ఆర్టీసీ బస్సులో తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. విశాఖపట్నం వైపునకు వెళ్తున్న ఏపీ 40జడ్ 0021 బస్సులో పాప, ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించి బస్సు డ్రైవర్ ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. రాజమండ్రి జీఆర్పీ పోలీసుల సహకారంతో శుక్రవారం పాపను రక్షించి ప్రకాశం జిల్లా వేమవరానికి చెందిన బొల్లా శ్రీనివాసులు, అల్లూరి సీతారామరాజు జిల్లా వేమవరానికి చెందిన సడేల చిన్నారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడ తరలించారు. కాగా, పాపను రూ.5 వేలకు విక్రయించానని మస్తాన్ ఒప్పుకొన్నాడు. రాజమండ్రిలో భిక్షాటన చేయించడానికి తీసుకెళ్తున్నామని ఆ ఇద్దరు వ్యక్తులు కూడా అంగీకరించడంతో పోలీసులు కేసు నమోదు చేసి, ముగ్గురినీ అరెస్టు చేశారు. కాగా, పాప తల్లి వెంకటేశ్వరమ్మను విజయవాడకు రప్పించి విచారణ చేయగా, మస్తాన్ తన నుంచి నాలుగు నెలలుగా దూరంగా ఉంటున్నాడని, రెండు రోజుల క్రితం తన చిన్న కుమార్తె శ్రావణిని అపహరించుకుని వెళ్లాడని తెలిపింది. వెంకటేశ్వరమ్మ ఫిర్యాదుతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.





కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తహసీల్దార్, ఇతర శాఖల అధికారులు

## విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

వేమూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సీజనల్‌గా వ్యాప్తి చెందే విష జ్వరాలపై మండల గ్రామాల స్థాయి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల జిల్లాలో విష జ్వరాల వల్ల ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం జరిగిందని గుర్తు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం తహసీల్దార్ సుశీల వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని కోరారు. వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్న తరుణంలో కార్యదర్శులు గ్రామాలలో పారిశుధ్య చర్యల్లో భాగంగా మురుగు కాల్వలు, పూడికలు తీయించడం నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడటం ప్లాస్టిక్, ఇతరమైన చెత్తకుప్పలు గ్రామాల్లో కనపడకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ బ్లీచింగ్ చల్లడంతో పాటు దోమల నివారణకు మందుల స్ప్రే చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, వేమూరు, జంపని, చావలి, పెరవలి, కోడిపర్రు గ్రామాల కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



నగరం ప్రభుత్వ వైద్యశాలలో జ్వరబాధితులను పరామర్శించి పండ్లు అందజేస్తున్న అనగాని శివప్రసాద్

## జ్వర బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

● అనగాని శివప్రసాద్

నగరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జ్వర బాధితులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ వైద్యులను కోరారు. నగరం ప్రభుత్వ వైద్యశాలలో జ్వరంతో బాధపడుతున్న రోగులను శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం నిజాంపట్నం మండలం ముత్తుపల్లి, చెరుకుపల్లిలో నమోదైన డెంగీ వ్యాధి లక్షణాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. నగరం, నిజాంపట్నం,చెరుకుపల్లి మండలాల్లోని ఎంపీడీవోలతో మాట్లాడి గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్, ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. తాగునీటి కుళాయిల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా గృహాల్లో వచ్చే చెత్తాచెదారాలను తొలగించాలని సూచించారు. మంత్రి అనగాని జ్వరబాధితులకు అండగా ఉంటారని, ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరం మండల పార్టీ అధ్యక్షుడు చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, గుడారంకయ్య, కొపనాతి రాజశేఖర్, వైవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి : కమిషనర్

రేపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో డ్రైడే సందర్భంగా ఇంటి పరిసరాలు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ళ మధ్య ఖాళీస్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో దోమల నివారణ మందు చల్లించామని తెలిపారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచే విధంగా బ్లీచింగ్ చల్లుతున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని విషజ్వరాల బారిన పడకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, సెక్రటరీలు సురేంద్ర, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణ మందు చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

## నేడు కలెక్టరేట్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి ఓ ప్రకటనలో తెలిపారు. ఈటిసి హాలులో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

## విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు

● మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రం భట్టిప్రోలు, మండల పరిధిలోని వెల్లటూరు గ్రామాల్లో పంచాయతీ, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు మందులను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు మొహిసినతాజ్, పవన్ చైతన్య, పంచాయతీ కార్యదర్శి నాయక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల గురించి వివరిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు

# నచ్చిన లైటింగ్‌కు లైక్ కొట్టండి!

● సీఆర్‌డీఏ ప్రాజెక్టు భవనం లైటింగ్ డిజైన్‌పై ఓటింగ్

● వెబ్‌సైట్‌లో రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలు

మంగళగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతిలో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ భవన నిర్మాణాల తాలూకు ఆకృతులు ప్రజాభీష్టానికి అనుగుణంగా ఉండాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. భవనాల బాహ్య ఆకృతులు ప్రజలు నచ్చే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పించుకున్నారు. పూర్తయిన భవనాలకు తుది మెరుగులు దిద్దేక్రమంలో వాటి తాలూకు ఆకృతులకు పలు రకాలుగా డిజైన్‌లను రూపొందించి.. వాటిల్లో ఏది ఎక్కువమంది ఆమోదం పొందిందో తెలుసుకోవడానికి ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. నవ్య రాజధాని అమరావతిలో పూర్తవుతున్న తొట్టతొలి భవనంగా ఏపీ సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం. గతంలో ఈ భవనం ప్రవేశ ద్వారానికి నాలుగు రకాలైన డిజైన్‌లను ఓటింగ్ నిమిత్తం ప్రజల ముందుంచారు. వాటిల్లో ఎక్కువమంది ఆమోదాన్ని పొందిన ఓ ఆకృతిని ఫైనల్ చేసి అదే డిజైన్‌ను భవనంపై ఏర్పాటు చేశారు. ఇపుడు తాజాగా సదరు ఆకృతికి తోడు భవనం ముందువైపు ఏ తరహా లైటింగ్‌ను ఏర్పాటుచేయాలనే దానిపై కూడ సీఆర్‌డీఏ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమయ్యారు. ఇందుకోసం రెండు రకాల డిజైన్‌లను రెండు సంస్థల చేత రూపొందింపజేశారు. ఒక డిజైన్‌ను సిగ్నిఫై అనే సంస్థ రూపొందించగా.. రెండవ డిజైన్‌ను జాక్వర్ సంస్థ తయారుచేసింది. ఈ రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలను సీఆర్‌డీఏ ఓటింగ్ నిమిత్తం శుక్రవారం తన వెబ్ సైట్‌లో అందుబాటులోఉంచింది. రెండింటిలో ప్రజామోదం పొందిన ఆ లైటింగ్ డిజైన్‌ను ఏర్పాటు చేస్తారు.




వీడియో-1 కు సంబంధించిన ఫొటో..



వీడియో-2 కు సంబంధించిన ఫొటో..

## మయూరం..భ్రమరాంబ



పెదకాకాని, ఆగస్టు 8( ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాస 3వ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారికి నెమలి పింఛములతో ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 15న సామూహిక వరలక్ష్మి వ్రతం జరుగుతుందని, ముత్తైదువులుపాల్గొని, అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

## మహాలక్ష్మి అమ్మవారికి బంగారు కిరీటం


బంగారు కిరీటంతో దాతలు ప్రకాశ్, నీలిమ దేవి

పెదకాకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్నా. శ్రీ దశావతార వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరావు, స్వర్ణ కుమారి దంపతులు, కుటుంబ సభ్యులు మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టి సమర్పించారు. విజయవాడకు చెందిన దాతలు ప్రకాష్, నీలిమ దేవి, కుటుంబ సభ్యులు అమ్మ వారికి బంగారు కిరీటం, శ్రావణ పట్టి సమర్పించారు.

# కలవరపెడుతున్న సుంకం

● సందిగ్ధంలో పడిన సాగు రైతులు

● అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం

● ఇతర దేశాలకు ఎగుమతులపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే వేగేశన

● చర్చలతో పన్ను తగ్గించాలి: వ్యాపారులు


బాపట్ల తీరంలో సాగు చేస్తున్న ఆక్వా చెరువులు

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా సాగు సంక్షోభం వైపు పయనిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో ఆ ఆక్వా రైతు కుదేలు అవుతున్నాడు. వ్యాపారులు కలవరపాటుకు గురవుతున్నారు. ఇప్పటికే సాగు పెట్టుబడులు పెరిగిపోయి.. దిగుబడులు తగ్గి విలవిల్లాడుతున్న రైతును ట్రంపు సుంకం.. మరింత బాధ పెడుతోంది. ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా ఉన్నప్పటికీ.. అమెరికా దిగుమతి సుంకం పెంచడంతో వ్యాపారులు సందిగ్ధంలో పడ్డారు. బాపట్ల జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న రొయ్యల విలువ రూ.888 కోట్లుగా ఉంది. ఇందులో అమెరికాదే అగ్రభాగం కావడం విశేషం. జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 22,500 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. 70 శాతం వెనామి రొయ్యలు, 30 శాతం టైగర్ రొయ్యలు సాగు చేస్తున్నారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్‌లు ఐదు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 10వేల మందికి ఉపాధి లభిస్తోంది. వ్యవసాయం తర్వాత ఆక్వాదే అగ్ర భాగం. అమెరికా టారిఫ్ ఫలితంగా స్వదేశీ మార్కెట్‌లో రొయ్యల ధరల తగ్గుముఖం పట్టాయి.

### వినియోగదారులపై ప్రభావం



ఆక్వా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు పెంచిన సుంకాల వల్ల వినియోగదారులపై భారం పడుతుంది. ఇప్పటికే 25 శాతం సుంకం అమలలోకి రాగా ఈ నెల 27 నుంచి మరో 25 శాతం అమలలోకి రానుంది. రాబోవు రోజుల్లో మరిన్ని అంక్షలు పెట్టే అవకాశం ఉంది. సుంకాల పెంపుదలను తీవ్రంగా ఖండిస్తున్నాం. పన్ను పెంచితే అమెరికాలో ధరలు పెరుగుతాయి. ఆ ప్రభావం అక్కడి వినియోగదారులపై పడుతుంది. కొన్ని దేశాలకు ఒకరంగా మరికొన్ని దేశాలకు మరొక రకంగా పన్ను విధించడం సరికాదు. పన్ను వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడింది. బయ్యర్లు ఎగుమతులు ఆపేయాలని చెప్పారు. కంటైనర్లు ఆగిపోయాయి. మిత్ర దేశం అంటూనే ఈవిధంగా చేయడం సరికాదు. ప్రధాని నరేంద్ర మోదీ చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు, వ్యాపారులు ఇతర దేశాలకు రొయ్యలు ఎగుమతి చేసే విషయంపై దృష్టి పెట్టాలి.

- వేగేశన నరేంద్రవర్మ, ఎమ్మెల్యే, రాయల్ మెరైన్ ఇంఫెక్స్, సీఎండీ

### చర్చలతో పన్ను తగ్గించే విధంగా చూడాలి



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెంచిన పన్ను వల్ల ఆక్వా రైతులు కుదేలవుతారు. ఇదేవిధంగా కొనసాగితే ఆక్వా రంగం ముందుకు సాగదు. ప్రభుత్వం చర్చించి పన్ను మొత్తం 20 శాతానికి తగ్గించే విధంగా చూడాలి. రాష్ట్రం నుం చి ఆక్వా ఉత్పత్తులు 60 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. పన్ను పెంచడం వల్ల హేచరీలు, ఫీడ్ మిల్లులు, రైతులు, హేచరీలు, మందుల దుకాణాలు మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉంది. గతంలో 8శాతం పన్ను మాత్రమే చెల్లించేవారని ఇప్పుడు 50 శాతానికి పెంచడం దారుణం. దేశంలో ఆక్వా ఉత్పత్తులు అధికంగా ఎగుమతి చేసే వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. విదేశీ మారక ద్రవ్యం దీని ద్వారా అధికంగా వస్తుంది. కావున దీనిని కాపాడుకునేవిధంగా ప్రభుత్వం చర్యలు జరపాలి.

- అనంత నగేష్‌బాబు, సెక్రటరీ జనరల్, జాతీయ మత్స్యకార సంఘం

# కల్ప వృక్షానికి కష్టకాలం



క్రోసూరు ప్రాంతంలో తగల బెట్టిన తాడి చెట్లు


పొలాలకు అడ్డంగా ఉన్నాయని నరికి వేసిన తాడి చెట్లు

క్రోసూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ప్రాంతంలో తాటి తోపులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పొలాలకు, పంటలకు సాగుకు అడ్డ మొస్తున్నాయన్న ఉద్దేశంతో రైతులు వాటిని తగల బెట్టడం, నరికి వేయడం చేస్తున్నారు. మండలంలోని అందుకూరు, అనంతవరం, నాగవరం, హసానాబాద్, 88 తాళ్ళూరు, పీసపాడు, విప్పర్ల, బాలెమర్రు, పారుపల్లి తదితర గ్రామాల పరిధిలో ఆయా ఊళ్లకు వెళ్లే.. మార్గంలో వందలాది తాటిచెట్లు దర్శనమిచ్చేవి. కొన్ని దశాబ్దాల క్రితం గృహాల నిర్మాణానికి, శుభ కార్యాలప్పుడు పందిళ్లు వేసుకోవడానికి తాటి చెట్ల అవసరం ఎంతో ఉండేది. ఇటీవల కాలంలో పల్లె ప్రాంతాలు కూడా కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్న నేపథ్యంలో తాటి చెట్ల అవసరం లేక పోవడంతో రైతులు వాటిని రూపు మాపే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ నుంచి వచ్చే గీత కార్మికులకే కాక స్థానికంగా ఉండే కార్మికులకు కూడా కల్లు గీత వల్ల ఉపాధి లభించేది. ఇటీవల కాలంలో వందలాది తాటి చెట్లను నరికేయడంతో.. భవిష్యత్తులో.. కల్ప వృక్షంగా భావించే తాడి చెట్లు కనుమరుగయ్యే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి.

# బొప్పాయి తోటలకు వైరస్ తెగుళ్లు


● దిగుబడులపై ప్రభావం ● నష్టాల బాటలో సాగుదారులు


లంక గ్రామాల్లో సాగవుతున్న బొప్పాయి తోట

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి తోటలకు వైరస్ తెగుళ్లు పట్టి పీడిస్తున్నాయి. తెగుళ్ల కారణంగా ఆ ప్రభావం దిగుబడులపై చూపడంతో గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో బొప్పాయి తోటలు సాగు చేస్తున్న రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో రైతులు ఏటా బొప్పాయి తోటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది రెండు మండలాల్లో సుమారు 50 హెక్టార్ల పైచిలుకు విస్తీర్ణంలో రైతులు బొప్పాయి తోటలు సాగు చేస్తున్నారు. ఎకరాకు 1,600 మొక్కలు నాటుతారు. ఒకొక మొక్క రూ.18లకు కొనుగోలు చేసి కూలీలతో విత్తుకుంటారు. ఎకరా విస్తీర్ణంలో మొక్కలకు సుమారు రూ.28,800 ఖర్చు అవుతుంది. దీనికి తోడు కౌలు రూ.50 వేలు, కూలీలు, ఇతర సాగు ఖర్చులు కలిపి ఎకరాకు రూ.లక్ష వరకు రైతులు పెట్టుబడులు పెట్టి.. బొప్పాయి తోట సాగు చేపట్టారు. తోటలను రింగ్ స్పాట్ తెగుళ్లు ఆశించడంతో తోటల్లోని ఆకులు రంగులు మారిపోవడం, మొక్కకు వచ్చి కాయలు ఎదుగుదల లేకపోవడంతో పాటు పక్వానికి కూడా రావడం లేదు. గుర్తించిన రైతులు ఉద్యాన శాఖాధికారులకు తోటల గురించి వివరించగా వారు పరిశీలించి తెగుళ్ల ఆశించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని, గాలిపాటున అప్పుడప్పుడు తెగుళ్ల బొప్పాయిని ఆశించడం జరుగుతుందని అధికారులు వివరించినట్లు రైతులు చెబుతున్నారు. తోటలను తెగుళ్ల ఆశించకుండా ఉంటే ఎకరాకు 20-25 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 10 టన్నుల దిగుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు సైతం నష్టపోవాల్సిన పరిస్థితులు దాపురించాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# కాల గర్భంలోకి.. శంకర్ విలాస్ ఆర్‌వోబీ


శంకర్‌విలాస్ ఆర్‌వోబీ, నిర్మాణ పనులు



● నేటి నుంచి కూల్చివేత ప్రారంభం

● ఆరు దశాబ్దాలకు పైగా నగరవాసులకు సేవలు



ప్రస్తుత బ్రిడ్జి సాంకేతిక వివరాలు

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంచుమించు 65 ఏళ్లకు పైగా నగర వాసులు గుంటూరు ఒన్ టౌన్ నుంచి టూ టౌన్‌కు సులభతరంగా ప్రయాణించేలా ఈ వారధి సేవలందించింది. అమరావతి, తాడికొండ, తుళ్లూరు తదితర ప్రాంతాలను గుంటూరు నగరంతో అనుసంధానం చేసింది. గుంటూరు రైల్వే యార్డు మధ్యన నిలబడి తన భుజాలను ఇరువైపులా చాచి వాహనాలను చేరవేసింది. ఆరు దశాబ్దాలకు పైగా నిలిచిన శంకర్ విలాస్ ఆర్‌వోబీ నేటి నుంచి కాలగర్భంలో కలిసిపోనుంది. ఈ బ్రిడ్జీ స్థానంలో కొత్త హంగులతో నాలుగు వరసల రైల్ ఓవర్ బ్రిడ్జీ పనులు ఇప్పటికే ప్రారంభమైన విషయం తెలిసిందే.

### ఆర్వోబీ చరిత్ర ఇదీ..

1958కి ముందు గుంటూరు రైల్వేస్టేషన్ చాలా చిన్నదిగా ఉండేది. అప్పట్లో రైల్వే యార్డు కూడా తక్కువ విస్తీర్ణంలోనే ఉంది. గుంటూరు - అమరావతి రోడ్డులో 500 మీటర్ల దూరంలో లెవల్ క్రాసింగ్ గేటు నంబరు 497ఏ ఉండేది. రైళ్లు, గూడ్సుల షంటింగ్ కారణంగా తరచుగా గేటు మూసేయాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యేవి. దాంతో అప్పట్లో జాతీయ రహదారుల శాఖ ఆర్‌వోబీని ప్రతిపాదించింది. ఇందుకు రైల్వే శాఖ కూడా ఆమోదం తెలపడంతో 1958 ఆగస్టు 4న అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి చేతుల మీదగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి నాటి మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్ ఎన్‌వీఎల్ నరసింహారావు, చీఫ్ ఇంజనీర్ (హైవేస్) ఆంధ్రప్రదేశ్ ఎన్.దురాని కూడా హాజరయ్యారు. అప్పటి ఎస్ఎస్ఆర్ ప్రకారం రూ.8.37 లక్షల అంచనా విలువతో బ్రిడ్జీ నిర్మాణాన్ని చేపట్టారు. బ్రిడ్జీకి ఉత్తరం వైపున అప్రోచ్ రోడ్డు పొడవు 793 అడుగులు, పిల్లర్ల నుంచి 446 అడుగులు, దక్షిణ వైపున అప్రోచ్ పొడవు 583 అడుగులు, పిల్లర్ల నుంచి 334.5 అడుగుల మేరకు బ్రిడ్జీని నిర్మించారు. రైళ్ల రాకపోకలకు వీలుగా బ్రిడ్జీ కింద నాలుగు కానాలు నిర్మించారు. బ్రిడ్జీ పైన రోడ్డు మార్గం 24 అడుగులు, కాలి బాటలు ఇరువైపులా 6 అడుగుల చొప్పున నిర్మించారు.

### పెరిగిన వాహనాల రద్దీ

కాగా 2001కి ముందు వరకు నగరంలో పెద్దగా వాహనాల సంచారం ఉండేది కాదు. దాంతో బ్రిడ్జీపై ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఎప్పుడైతే కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య పెరిగిందో అప్పటి నుంచి ఈ ఆర్‌వోబీపై ట్రాఫిక్ సమస్యలు పెరుగుతూ వచ్చింది. దాంతో ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జీ మధ్యలో తాత్కాలిక ప్లాస్టిక్ డివైడర్ స్తంభాలు ఏర్పాటు చేసి కొంత మేరకు వాహనాలు ఒక దాని వెంట ఒకటి వెళ్లేలా చేశారు. ఆర్ అండ్ బీ డిపార్టుమెంట్ అడపాదడపాగా మరమ్మతులు నిర్వహించేది. కాలిబాటలపై పలుమార్లు టైల్స్ నిర్మించింది. బ్రిడ్జి పైన హాట్ మిక్స్‌తో రోడ్డు వేయడం వల్ల ఫుట్‌పాత్‌ల ఎత్తు తగ్గిపోయాయి. దాంతో వాటిపై కూడా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్థానంలో నూతన ఆర్‌వోబీని నిర్మించాలన్న ఆలోచన 2004లోనే జరిగింది. అయితే ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితం అయ్యాయి తప్పా కార్య రూపం దాల్చలేదు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం సేతు బంధన్ స్కీమ్ కింద ఈ ఆర్‌వోబీ నిర్మాణాన్ని శాంక్షన్ చేసింది. అయితే పరిపాలన అనుమతులు, నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకొని రూ. 98 కోట్ల నిధులు మంజూరు చేయించి పాత బ్రిడ్జి స్థానంలో నూతన ఆర్‌వోబీని నిర్మింప చేస్తున్నారు. కాగా శుక్రవారం చాలామంది పాత బ్రిడ్జి వద్దకు చేరుకొని తీపి జ్ఞాపకాలుగా డిజిటల్‌లో భద్రం చేసుకొనేందుకు ఫోటోలు దిగారు.

### కొత్త బ్రిడ్జి సాంకేతిక అంశాలు

సెంట్రల్ డివైడర్, ఫుట్‌పాత్‌లు కలుపుకొని మొత్తం 21.550 మీటర్ల వెడల్పుతో ఈ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. మొత్తం 930 మీటర్ల పొడవునా.. ఈ వంతెనలో జీజీహెచ్ వైపు 168 మీటర్ల ఆర్‌ఈ(రీయిన్‌ఫోర్స్‌డ్ ఎర్త్) వాల్ 168 మీటర్లు, వయాడక్ట్ స్పాన్‌లు 11 నంబర్లు కలిపి 253 మీటర్లు, రైల్వే భాగం 64 మీటర్లు, అరండల్‌పేట వైపున వయాడక్ట్ స్పాన్‌లు 10 నంబర్లు కలిపి 230 మీటర్లు, ఆర్‌ఈ వాల్ 215 మీటర్ల పొడవునా నిర్మిస్తారు. 23 అడుగుల వెడల్పుతో రెండు వైపులా సర్వీసు రోడ్లను నిర్మిస్తారు. బ్రాడీపేట నాల్గో లైను, అరండల్‌పేట ఐదో లైను, జీజీహెచ్ వద్ద అండర్‌పాస్‌లు సదుపాయాలుంటాయి. ఉమెన్స్ కాలేజ్ జంక్షన్ నుంచి ఏసీ కళాశాల వైపునకు 100 మీటర్ల దూరంలో బ్రిడ్జీ ప్రారంభమవుతుంది. అరండల్‌పేట వైపు నుంచి సులభతరంగా ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోకి వెళ్లిపోవచ్చు. ప్రస్తుత ఆర్‌వోబీ రైల్వేట్రాక్ కంటే 5.9 మీటర్ల ఎత్తులో ఉంది. దీనిని మారిన రైల్వే నిబంధనల ప్రకారం 9 మీటర్ల ఎత్తుకు నూతన బ్రిడ్జీని పెంచ బోతున్నారు. అరండల్‌పేట వైపున 8 - 9 లైన్ల మధ్యన ఈ బ్రిడ్జి ప్రారంభమవుతుంది. 2028 లోపే ఈ బ్రిడ్జీ నిర్మాణాన్ని పూర్తి చేసి సీఎం చంద్రబాబు చేతుల మీదగా ప్రారంభింప చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకొని ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రెండు పిల్లర్ల నిర్మాణం పూర్తి అయింది.

# నకిలీ యజమానిని ఫొటో పట్టిచ్చేస్తుంది..

● రిజిస్ట్రేషన్ల అక్రమాలకు చెక్

● స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు

సత్తెనపల్లి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు చెక్ పడనుంది. ఎవరినో తీసుకువచ్చి ఇతనిదే భూమి అని చెప్పి దొంగ రిస్ట్రేషన్ చేయించడం ఇకపై కుదరదు. గతంలో ఒకే పేరు ఉన్న వ్యక్తులను తీసుకు వచ్చి ఆధార్ మార్పులు(నకిలీ) చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. డబుల్ రిస్ట్రేషన్‌లు సైతం జరిగాయి. వీటన్నిటికీ ఇకపై చెక్ పడనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే డాక్యుమెంట్ ఎవరు చేయించుకుంటున్నారో స్పష్టంగా తెలిసిపోతుంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో పలు మార్పులు ప్రభుత్వం చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో ఇది వరకు సంబంధిత వ్యక్తుల వివరాలు మాత్రమే వచ్చేవి. దీంతో భూమికి సంబంధం లేని వ్యక్తిని తీసుకువచ్చినా తెలిసేది కాదు. మార్పుల నేపథ్యం సంబంధిత వ్యక్తి ఆధార్ నంబర్ చెప్పగానే అందులో ఉన్న ఫొటో ప్రిపరేషన్ డేటాలో వస్తుంది. మూడురోజుల నుంచి ఈ విధానం అమలవుతోంది.

### కొనుగోలు దారుని చేతికే డాక్యుమెంటు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే డాక్యుమెంటును కొనుగోలు దారునికే ఇవ్వనున్నారు. ఈ విషయంలో గతంలో క్రయ, విక్రయ దారులు ఇబ్బందులు పడేవారు. కొందరు మధ్యవర్తులు జోక్యం చేసుకుని డాక్యుమెంట్లు తీసుకునేవారు. కొన్ని సందర్భాల్లో డాక్యుమెంటు రైటర్లు ఎవరో ఒకరికి ఇవ్వడం ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తికి దక్కడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుత విధానంలో ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే కార్యాలయంలో వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత డాక్యుంటును సంబంధిత వ్యక్తికి అందజేస్తారు.

### ఓటీపీ ఇక్కట్లు

నూతన విధానంలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. వన్ టైమ్ పాస్ వర్డ్ వల్ల కొన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. మొబైల్ ఫోన్‌ను ఆధార్‌కు లింకు చేసుకోని వారికి ఇది ఇబ్బందిగా మారింది. అత్యవసరంగా రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చి కూడా డాక్యుమెంటేషన్ చేయించుకోలేని పరిస్థితి తలెత్తుతుందని డాక్యుమెంటు రైటర్లు చెబుతున్నారు. చదువురాని వారు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఓటీపీ ద్వారా వచ్చే మెసేజ్‌లు అర్థం కాక.. ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. ఆధార్ నంబరు నమోదు చేయగానే ఓటీపీ రాకుండా కేవలం ఫొటో వచ్చేలా చేస్తే సరిపోతుందని అంటున్నారు.

### ఫొటోల ద్వారా తెలిసి పోతుంది

రిజిస్ట్రేషన్‌కు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో గతంలో ఫొటోలు వచ్చేవి కావు. ఇప్పుడు ఆధార్ ఓటీపి విధానంతో ఫొటో వస్తుంది. దీంతో సంబంధిత వ్యక్తి అసలా..నకిలా.. అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దీని వల్ల మోసాలకు తావు ఉండదు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డాక్యుమెంటును కూడా ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే తీసుకోవచ్చు. థంబ్ వేయడం ద్వారా సంబంధిత వ్యక్తి తీసుకోవాల్సి ఉంటుంది.

- అశోక్, సబ్ రిజిస్ట్రార్, సత్తెనపల్లి

# ఆరోగ్యానికి భరోసా.. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు

సత్తెనపల్లి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు(ఆరోగ్యశ్రీ) సేవలు పల్నాడు జిల్లాలో రోగులకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా 3,257 రకాల వ్యాధులకు.. ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. పేదలే కాదు కార్డులు ఉన్న ఉన్నత స్థాయి వర్గాల వారు సేవలు పొందుతున్నారు. కార్డులేని అర్హులకు కూడా వైద్యసేవలకు సీఎంఓ అనుమతులు ఇప్పిస్తున్నారు.

### కార్డు లేకుంటే ఎవరిని సంప్రదించాలి

ఆరోగ్యశ్రీ కార్డులేని అర్హులు అనారోగ్యానికి గురైె నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్య మిత్రలను సంప్రదించాలి. వారు జిల్లా సమన్వయ కర్త కార్యాలయానికి వివరాలు తెలియజేస్తారు. అర్హతను పరిశీలించి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి అధకారికంగా.. అధికారికంగా అనుమతులు తీసుకుని వైద్యసేవలు అందేలా చర్యలు చేపడతారు.

### ఆరోగ్య మిత్రల వ్యవస్థ

ఆరోగ్య మిత్ర వ్యవస్థ ఉంది. పూర్తి ఉచితంగా సేవలు అందించి. డిశ్చార్జ్ తర్వాత రవాణా చార్జీలు అందజేస్తారు. ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. అదనంగా డబ్బులు తీసుకుంటే 104, 14400 టోల్‌ఫ్రీ నంబర్లకు ఆరోగ్యమిత్రలకు ఫిర్యాదు చేయవచ్చు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

● ఆలయాలకు పోటెత్తిన మహిళా భక్తులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీవ్రతం పండుగను శుక్రవారం మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని పలు దేవాలయాలలో సైతం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. స్థానిక మంగమూరు రోడ్ అచలానంద ఆశ్రమంలో ఏర్పాటుచేసిన వరలక్ష్మీ వ్రతాలలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీపరిపూర్ణ సిద్ధానంద స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన చేశారు. అదేవిధంగా బీవీఎస్ హాలు దగ్గర ఉన్న శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో వరలక్ష్మీవ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొనగా ఆలయ అర్చకులు వారి చేత వ్రతాలను నిర్వహింపజేశారు. ఇక కేశవస్వామిపేట శ్రీవిజయదుర్గా దేవస్థానం, లాయర్‌పేట శ్రీ సాయిబాబా మందిరంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీనాగలక్ష్మి దేవస్థానం మొదలైన పలు దేవాలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

**మద్దిపాడు మండలంలో..**

మద్దిపాడు: మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖర్ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన వ్రతాలలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మార్నేని రాఘవ, ఈవో దామా నాగేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అదేవిధంగా మద్దిపాడు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు మద్దిపాటి వెంకటరమణ దీక్షితులు, గోపయ్య పంతులు ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి.



మహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు



అచలానంద ఆశ్రమంలో..

**ఉప్పుగుండూరులో..**



అమ్మవారికి సారె అందిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

నాగులుప్పలపాడు: మండలంలోని పలు గ్రామాలలో సామూహిక వరలక్ష్మీవ్రతాలను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుండే దేవాలయాలు మహిళా భక్తులతో కిక్కిరిశాయి. ఉప్పుగుండూరులోని అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. పూజారి గోనుగుంట నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అన్నసంతర్పణ చేశారు. వాసవీ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన వరలక్ష్మి వ్రతాలలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో మోటుమర్రి నాగేశ్వరరావు, గోనుగుంట వీరబ్రహ్మాచారి, సాతులూరి సత్యనారాయణ, గోగినేని నాగేశ్వరరావు, బెల్లం ఆంజనేయులు, యాదల ప్రకాశరావు, కొంజేటి వెంకటసురేష్‌బాబు, కొంజేటి జలంధర్, వేణు, పులకణం రాజేష్ పాల్గొన్నారు.



అచలానంద ఆశ్రమంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

**హరిహరక్షేత్రంలో..**



పూజలో పాల్గొన్న శిద్దా రాఘవరావు

చీమకుర్తి: వరలక్ష్మీవ్రత పర్వదిన వేడుకలను శుక్రవారం మండల పరిధిలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చీమకుర్తి పట్టణంలోని హరిహర క్షేత్రం లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తన కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

## క్విస్‌లో విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు



మాట్లాడుతున్న జయంత్‌బాబు

ఒంగోలు విద్య, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్రిడ్జికోర్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు కళాశాల పూర్వ విద్యార్థులతో ఉపన్యాసలు ఇప్పిస్తున్నారు. కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి, ప్రస్తుతం సర్వీసెస్ కంపెనీలో ఉన్నత స్థానంలో ఉన్న జయంత్‌బాబు శుక్రవారం తన అనుభవాలను కొత్త విద్యార్థులతో పంచుకున్నారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులు, ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యార్థులు తమ గ్రూపులోని సబ్జెక్టులపై పూర్తి పట్టు సాధించాలని, అవసరమైన సాంకేతికను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాలలోని అధునాతన వసతులను సద్వినియోగంచుకోవాలని కోరారు. కళాశాల అధినేత సూర్యకళ్యాణ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాయత్రిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాధవ్ పర్యటన విజయవంతంపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ నాయకత్వంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన సారథ్యం యాత్ర విజయవంతం పట్ల ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. కార్యకర్తల అంకితభావానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా సాయిబాబా నగరోత్సవం

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్ సాయిబాబా నగర్‌లోని శ్రీషిర్డి సాయినాథ దేవస్థానంలో ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి బాబా నగరోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మందిర నిర్వాహకులు టీవీ.శ్రీరామమూర్తి మాట్లాడుతూ శనివారం ఉదయం బాబా వారికి పూలాభిషేకం, అనంతరం భక్తులకు అన్నసమారాధన ఉంటాయని తెలిపారు. కనుక భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నార్ల రాజశేఖర్, పల్లపోతు వెంకటేశ్వరరావు, మేడికొండ మోహన్‌రావు, ఆకుతోట చంద్ర, సోమిశెట్టి కృష్ణ, తెలిదేవులపల్లి సాయి, సుబ్రహ్మణ్యం, టి.అంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాపునాడు కోఆర్డినేటర్‌గా సుధాకర్



నియామకపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాపునాడు జిల్లా కోఆర్డి నేటర్‌గా చెంగలశెట్టి సుధాకర్‌ను నియమించినట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కాపునాడు అధ్యక్ష, కార్యదర్శులు పోగుల మల్లికార్జున్, దాసరి పిచ్చయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని కాపునాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఒంగోలు, కొండపి నియోజకవర్గాలకు కో ఆర్డినేటర్‌లను నియమించినట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలలో కూడా కోఆర్డినేటర్‌లను, కమిటీలను నియమించి కాపుడునాడు బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. కాపు రిజర్వేషన్ కోసం, అలాగే కాపుల హక్కుల సాధనకు కాపునాడు భవిష్యత్ కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ నారాయణ, సభ్యులు ఆకుల చలమయ్య, గంటా కన్నయ్య, గాజుల కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన డాక్టర్ కృష్ణారావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన ప్రముఖ డాక్టర్ ఎం.కృష్ణారావు బీజేపీలో చేరారు. ఒంగోలు నగరంలో కృష్ణమల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేసి గత 20 ఏళ్ళ నుంచి వైద్య సేవలు అందిస్తున్న ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ పురోభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఆయన తెలిపారు.

## వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

చినగంజాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామి తిరునక్షత్రం(జన్మనక్షత్రం) శ్రావణాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. వేదపండితులు పరాశరం రామాచార్యులు వేదమంత్రోచ్చరణతో దంపతులతో స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. నిర్వహకులు గుద్దంటి పిచ్చయ్య, ఆలయ అభివృద్ధి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాతి మండప నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న రామాంజనేయులు, లక్ష్మి దంపతులు

అద్దంకి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణానికి పంగులూరు మండలం ఆరికట్లవారిపాలేనికి చెందిన ప్రస్తుతం అద్దంకి పట్టణంలోని బ్రహ్మానందం కాలనీ రోడ్డులో నివాసం ఉంటున్న మాగులూరి దశరధ రామాంజనేయు లు, లక్ష్మీ దంపతులు శుక్రవారం రూ.1,01,116లు ఈఓ తిమ్మానాయుడుకు అందజేశారు. టీడీపీ నేత మాగులూరి గోపి పాల్గొన్నారు.

## అంతన్నారు.. ఇంతేనా..?

(5వ పేజీ తరువాయి)

పెద్దఎత్తున బర్లీ నిల్వలు ఉన్నాయని తెలిసినా అందుకు తగ్గట్లు గిడ్డంగుల లభ్యత ఉందో లేదో తెలుసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న గోడౌన్లలో కొనుగోలు చేసిన బర్లీ నిల్వలను మార్క్‌ఫెడ్ ఉంచింది. ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు నిల్వలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. ఇప్పుడు గోడౌన్లను వెదకడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి, కొన్ని సందర్భాల్లో అయితే తేదీ మారే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ఉండేందుకే స్లాట్ సిస్టమ్ అని చెప్పిన మార్క్‌ఫెడ్ ఇప్పుడు చేతులెత్తేయడం కూడా రైతుల విమర్శలకు కారణమైంది. రెండే గ్రేడ్లు అని ముందు చెప్పిన మార్క్‌ఫెడ్ మూడుగా విభజించి కొనుగోలు చేయడంతో పాటు ధరల విషయంలో కూడా అదే రీతిన వ్యవహరిస్తోందనేది రైతుల ఫిర్యాదు. ఇలా అనేక బాలారిష్టాలతో రైతులు కలవరం చెందుతున్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే దామచర్ల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఆదరణ పథకం ద్వారా ఉచిత విద్యుత్ పథకం అమలు చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు నాయీ బ్రాహ్మణులు శుక్రవారం ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చిత్రపటాలకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల షాపులకు 200 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్ అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ నిడమానూరి రమేష్, పెళ్కూరి చినవెంకటేశ్వర్లు, పిల్లుట్ల సుధాకర్, అన్నవరపు వెంకట్రావు, గుంటూరు సారధి తదితరులు పాల్గొన్నారు.

## పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌కు సత్కారం



ఛైర్మన్ సీతారామయ్యను సత్కరిస్తున్న సభ్యులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలు అందించిన ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (పీడీసీసీబీ)కు అవార్డు దక్కడంపై ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను సీవీఎన్ రీడింగ్ సభ్యులు ఘనంగా ఘనంగా సత్కరించారు. ఇటీవల ఛైర్మన్ సీతారామయ్య ఆప్‌కాప్ నిర్వహించిన సభలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతులు మీదగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఒంగోలులో సీవీఎన్ రీడింగ్ రూమ్ పాలకవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందించారు. అనంతరం పలు అంశాలపై వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీవీఎన్ రీడింగ్ రూమ్ అధ్యక్షుడు ఇ.గురునాథరావు, కార్యదర్శి కె.రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు ఆర్.నితిన్‌రెడ్డి, కోశాధికారి ప్రతాప్, జాయింట్ సెక్రటరీ టి.నవీన్, ఈసీలు శేషబాబు, కిరణ్, రామకృష్ణ, బాలకృష్ణ, పూర్ణచంద్రరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

## ఘనంగా గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఒంగోలులో గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక రథంపై అలిమేలు మంగ, పద్మావతి, వేంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను ఉంచి కోర్ట్ సెంటర్ బాపూజీ గోశాల వద్ద నుంచి కేశవస్వామిపేట, సీతారంపురం, గద్దలగుంట, రాజాపానగల్ రోడ్ మొదలైన రహదారులలో కొనసాగిన గిరిప్రదక్షిణ శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంది. అనంతరం పురోహితులు భక్తులకు వేద ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాద వితరణ చేశారు. కమిటీ నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవ రెడ్డి, దేసు కృష్ణారావు పర్యవేక్షణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నోబిడ్‌లతో పొగాకు రైతుల అగచాట్లు

● వ్యాపారుల తీరుపై తీవ్ర నిరసన



బేళ్లను ఇళ్లకు తీసుకుపోతున్న రైతులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో జరుగుతున్న వేలంలో నోబిడ్‌లు భారీగా నమోదు అవుతున్నాయి. శుక్రవారం జరిగిన వేలంలో 166 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. మొత్తం 740 బేళ్లు వేలానికి రాగా 510 బేళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. పలు కారణాలతో మిగతా బేళ్లను కొనుగోలు చేయకపోవడంతో వాటిని తమ ఇళ్లకు తీసుకుపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నోబిడ్‌లతో తమకు తీవ్ర నష్ట వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని పొగాకు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై జరిగింది. మార్టూరుకు చెందిన ఆర్.సీతామహాలక్ష్మి తన స్కూటీపై ఒంగోలు నుంచి మార్టూరు వెళుతుండగా ఒక్కసారిగా లారీ రావడంతో అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కింది. దీంతో ఆమె తలకు గాయాలు కాగా ప్రైవేటు వాహనంలో మేదరమెట్ల వైద్యశాలకు తరలించారు.

# వసతి గృహ విద్యార్థులకు నీటి కష్టాలు..!

● ఒంగోలు ఎస్సీ హాస్టల్-2 విద్యార్థుల అవస్థలు

● పట్టించుకోని వార్డెన్



కార్పొరేషన్‌కు చెందిన పైపులైన్, చేతిపంపు నుంచి నీరు పట్టుకుంటున్న విద్యార్థులు

ఉన్నతంగా చదువుకునేందుకు ఉన్న ఊరు వదిలి ఒంగోలు విచ్చేసిన వసతి గృహ విద్యార్థులకు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఒక వైపు మండుతున్న ఎండలకు గొంతు తడిచే పరిస్థితి లేకపోగా, నాలుగు రోజులుగా కనీసం స్నానాలు కూడా కరువయ్యాయి. వివరాల్లోకెళితే.. ఒంగోలు నగరం అంజయ్య రోడ్‌లోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్-2లో ఇంటర్ నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసిస్తున్న 150 మంది విద్యార్థులు ఉన్నారు. వారు నీటి కోసం అల్లాడిపోతున్నారు. హాస్టల్‌లో ఏర్పాటు చేసిన మోటరు చెడిపోవడంతో కనీసం మరమ్మతులు కూడా చేయించకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత వార్డెన్ మునికుమార్ దృష్టికి తీసుకెళ్ళినా స్పందించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కొందరు విద్యార్థులు తిరిగి ఇళ్ళకు వెళ్ళిపోగా, కొందరు అక్కడే ఉంటూ దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కనీసం వాడుకోవడానికి కూడా నీరు లేని పరిస్థితి ఇక్కడ చోటు చేసుకుంది. దీంతో సమీపంలోని కార్పొరేషన్‌కు చెందిన చేతిపంపు (బోరింగ్) నుంచి ఉప్పునీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి హాస్టల్‌లోని నీటి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

# ఓటర్ల జాబితా సమగ్ర సవరణను వ్యతిరేకించాలి

● వామపక్ష నాయకుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎన్ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమని వామపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను దేశంలోని ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ మరో రెండు నెలల్లో జరగనున్న బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో అధికారాన్ని కాపాడుకునేందుకు ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, విదేశీ ఓటర్లు ఉన్నారనే కారణంతో ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా 64 లక్షల ఓట్లను తొలగించారని విమర్శించారు. తాను భారత పౌరుడినని నిరూపించుకోవాల్సిన బాధ్యతను ఓటర్లపై పెట్టడమంటే రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు నిరాకరించడమేనని స్పష్టం చేశారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీహెచ్.సాగర్ మాట్లాడుతూ బీజేపీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని మత సామరస్యాన్ని, ప్రజాస్వామ్యవస్థలను నాశనం చేస్తుందని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ ఎప్పుడో చేపట్టాల్సిన ఓటర్ల సవరణ ప్రక్రియను బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టడం కుట్రదాగి ఉందని ఆరోపించారు. ధర్నాకు సీపీఐఎంఎల్(న్యూడెమోక్రసీ), పలు ట్రేడ్ యూనియన్లు, ఇతర సంఘాలు మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో నాయకులు కంకణాల ఆంజనేయులు, రమేష్, పెంట్యాల హనుమంతరావు, జె.జయంతిబాబు, కాలం సుబ్బారావు, జి.రమేష్, బంకా సుబ్బారావు, బి.రఘురాం, వి.బాలకోటయ్య, టి.రాము, పెంట్యాల కల్పన, కేజీ.మస్తాన్, ఉబ్బా ఆదిలక్ష్మి, జి.శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, టి.మహేష్, సీహెచ్.రాంబాబు, భక్తసింగ్‌రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## నగరం 'పచ్చ'గుండేలా..!



కార్పొరేషన్ కార్యాలయంలోకి మొక్కలను దించుతున్న కూలీలు

ఒంగోలు నగర అభివృద్ధి.. సుందరీకరణ కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఇప్పటికే రహదారుల విస్తరణ.. మరోవైపు సెంటర్ డివైడర్లు, ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలకు అందమైన రంగులతో, ఆకట్టుకునే బొమ్మలతో ముస్తాబు చేశారు. ఇకపై నగరంలో పచ్చని మొక్కలు పెంచే దిశగా కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఒంగోలు నగరానికి సుమారుగా 5వేల మొక్కలును దిగుమతి చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం.. నగర వీధులలో వీటిని నాటునున్నారు. అందులో సగం మొక్కలు నీడనిచ్చే చెట్లు ఉంగా, మిగిలిన సగం వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను తీసుకొచ్చారు. కడియం నుంచి తీసుకొచ్చిన ఐదువేల మొక్కలను కార్పొరేషన్ కార్యాయలంలో ఉంచగా, ఇళ్ళలో పెంచుకునేవారికి కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

## ఘనంగా శ్రీవారి పవిత్రోత్సవాలు



వస్త్రాలు సమర్పిస్తున్న న్యాయాధికారి నరేంద్రరెడ్డి దంపతులు

ఒంగోలు(కల్చ రల్), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం జూనియర్ సివిల్ న్యాయాధికారి కంది నరేంద్రరెడ్డి, స్వప్న దంపతులు స్వామి వారికి మేల్ ఛాట్ వస్త్రాలను సమర్పించారు. అనంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు, చతుర్వేద పారాయణ మొదలైన కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త సీవీ.రామకృష్ణా రావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి, డాక్టర్ శ్రీనివాసచరణ్‌రాజీవ్, ఆలూరు జైశంకర్ తదితరులు పర్యవేక్షించారు.

# ముమ్మరంగా వరినాట్లు

● సాగర్ కాలువలకు నీరు విడుదల

● ఆయకట్టు భూముల్లో సాగు ఆరంభం

దర్శి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.



మాగాణి కోసం దమ్ము చేస్తున్న ట్రాక్టర్

ఈ ఏడాది ఊహించని విధంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు ముందుగానే నిండిన విషయం తెలిసిందే. వరద నీరు ఇంకా వస్తుండటంతో సాగర్ కాలువలకు నీరు విడుదల చేశారు. దీంతో ఆయకట్టు భూముల్లో రైతులు వరిసాగు ఆరంభించారు. బోర్ల వసతి ఉన్న రైతులు గత నెలలోనే వరినార్లు పోశారు. ప్రస్తుతం సాగర్ కాలువలకు నీరు విడుదల కావటంతో ఆ ప్రాంత రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని తూర్పువీరాయపాలెం, బొట్లపాలెం, చెరువుకొమ్ముపాలెం, పాపిరెడ్డిపాలెం, దర్శి తదితర ప్రాంతాల రైతులు వరినాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సక్రమంగా వర్షాలు లేకపోవటంతో సాగర్ ఆయకట్టులో అధికశాతం పైర్లు వేయలేదు. ఆయకట్టు భూములు ఖాళీగా ఉండటంతో దుక్కులు దున్ని పెట్టారు. దీంతో ప్రస్తుతం వరినాట్లు వేసుకునేందుకు అనుకూలంగా ఉంది. గత 20 సంవత్సరాల కాలంలో జూలై నెలలోపు శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లు నిండటం ఇదే ప్రథమం. జలాశయాలు నిండుకుండలా కళకళలాడుతుండటంతో సాగునీటికి ఢోకాలేదు. దీంతో అన్నదాతలు ఆనందంతో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.



చెరువుకొమ్ముపాలెంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

## అవీ..ఇవీ..

### కల్యాణ మండపం పునర్నిర్మాణానికి విరాళం

చీరాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపం పునర్నిర్మాణానికి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చక్కా.నారాయణ రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. అలాగే శ్రీమహదేవ వేదగోశాలకు రూ.10 వేల విలువైన బీరువా, గోవుల ఆహారార్థం రూ.1116 అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ వివాహ వార్షికోత్సవం సందర్భంగా తోడ్పాటు అందించినట్లు చెప్పారు. అన్నిరకాల వేడుకలకు వ్యయం వృథా చేయకుండా సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, తిరుపతిరావు, సుబ్బారావు, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

మార్టూరు, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్, ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అ వకాశాన్ని మార్టూరు ప్రాంత ప్రజానీకం వినియోగించుకోవాలని వారు కోరారు.

### పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

● ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో

పందిళ్లపల్లి (చీరాల), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ విధిగా చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు హెచ్చరించారు. కలెక్టర్ వెంకటమురళీ ఆదేశాల మేరకు వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో ఎంపీడీవో రాజేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల వైరల్‌వ్యాధులు ప్రబలడంతో అప్రమత్తమైన అధికారులు చెత్తసేకరణ, బ్లీచింగ్ వంటి వాటిపై దృష్టి సారించారు. అందుకు సంబంధించిన పనులను ఆర్డీవో శుక్రవారం తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఈవోఆర్డీ అన్నం శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

**దోమల నివారణకు చర్యలు**

అద్దంకి : విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాలతో అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణ చర్యలకు ఉపక్రమించారు. అద్దంకి పట్టణంలో మురుగునీరు నిల్వ ఉండే ప్రాంతంలో ఆయిల్‌బాల్స్ ఏర్పాటు, ఎబిట్ పిచికారికి చర్యలు చేపట్టినట్లు కమీషనర్ రవీంద్ర తెలిపారు. అన్ని ప్రాంతాలలో ఫాగింగ్ చేపడుతున్నట్లు, మురుగునీరు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన నూతన కమిటీ

చీరాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగవ తరగతి ఉద్యోగుల చీరాల తాలూకా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం చీరాల డ్రయినేజీ అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులుగా మురళీకృష్ణ, కార్యదర్శిగా సాయికుమార్, కోశాధికారిగా సులోచన ఏకగ్రీవమయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు వ్యవహరించగా కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వరరావు, శేషుబాబు, శ్రీనివాసరావు, సుధాకర్, శ్రీను నూతన కమిటీను సత్కరించారు.

### యువ ఆంధ్ర ప్రో కబడ్డీకి రిఫరీగా శ్రావణి



వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రావణి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : యువ ఆంధ్ర ప్రో కబడ్డీ సీజన్-1 పోటీలకు వేటపాలెం జిల్లా పరిషత్ వ్యాయామ ఉపాధ్యాయినీ జరుబుల శ్రావణి ఎంపికయ్యారు. ఉమ్మడి ప్రకాశం నుండి సుమారు 30 జాతీయ స్థాయి పోటీల్లో శ్రావణి సత్తాచాటారు. దీంతో శ్రావణిని రిఫరీగా ఎంపిక చేస్తూ ఆంధ్ర కబడ్డీ రిఫరీస్ బోర్డ్ శుక్రవారం ప్రకటించింది. ఈ నెల 15 నుండి 25 వరకు పోటీలను నిర్వహించనుననట్లు శ్రావణి తెలిపారు. అయితే పోటీలకు సంబంధించి వైజాగ్, విజయవాడలో వేదికలను పరిశీలిస్తున్నట్లు శ్రావణి తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

### ఎంఈవో-2గా శ్రీనివాసరావు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

అద్దంకి, ఆగస్టు 8(ఆంధ్ర జ్యోతి): అద్దంకి మండల ఎంఈవో-2గా కేవీ. శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చక్రాయపాలెం హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. చీరాల డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, అద్దంకి ఎంఈవో-1 గంగాధరరావు సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు. రెండున్నర దశాబ్దాలుగా అద్దంకి మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు.



# గ్రంథపఠనం తెచ్చిన విజయం



గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న యువకులు

● కానిస్టేబుల్ కొలువు సాధించిన ఎనిమిది మంది యువకులు ● ఇక్కడే పోటీ పరీక్షల పుస్తకాల అధ్యయనం

చీరాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వారంతా పేద కుటుంబాలకు చెందిన యువకులు. తల్లిదండ్రులు కూలీనాలీ చేసి చదివించారు. వీరికోసం అప్పులు కూడా చేశారు. అయితే పెద్దల కష్టాన్ని వమ్ము చేయకూడదనే నిశ్చయించుకున్నారు. ఎలాగైనా పోలీసు కొలువు సాధించాలనే ధృడసంకల్పంతో చీరాలశాఖ గ్రంథాలయాన్ని కేరాఫ్‌గా మార్చారుకున్నారు. పట్టిందే పట్టుగా పుస్తక పఠనం సాగించారు. ఇక్కడి కాంపిటేటివ్ పుస్తకాలపై కుస్తీపట్టి ఎనిమిది మంది యువకులు ఇటీవల విడుదలైన ఫలితాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. దీంతో విజ్ఞాన వెలుగులు పేదిట్లో ప్రసరించాయి.

**గ్రంథాలయంతో ప్రయోజనం**

గ్రేడ్-2 చీరాలశాఖ గ్రంథాలయం 1956 ఏర్పడింది. ఆనాటి నుంచి ఎంతో మంది యువతీ యువకులు ఇక్కడ శిక్షణ పొంది ఉన్నతంగా రాణించారు. అలాగే పుస్తక ప్రియులు, చిన్నారులు సైతం ఇక్కడ జ్ఞాన సంపాదన కోసం ఇక్కడకు వస్తుంటారు. అందుకు అనుగుణంగా నిర్వాహకులు కూడా ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహ పరుస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా గ్రంథాలయం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు శాశ్వత భవనం లేక ఇప్పటికే పలుచోట్లకు మారింది. ఈక్రమంలో నేటికీ కూడా అదే అద్దె భవనంలో నిర్వహణ కొనసాగుతుంది. పైగా ప్రస్తుతం పైఅంతస్తులో ఉండడం తో చాలా వరకు పాఠకులు అసౌకర్యం చెందుతున్నారు. ప్రయోజనకరమైన గ్రంథాలయాన్ని అనుకూలమైన ప్రదేశంలో నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతు న్నారు.

**గ్రంథాలయం చక్కని వేదిక**



మత్స్యకార కుటుంబంలో జన్మించాను. అనుకోని రీతిలో అనారోగంతో నాన్న మృత్యువాత పడ్డారు. దీంతో అమ్మ కష్టపడి రోజువారీ కూలీతో నన్ను, తమ్ముడిని చదివించింది. అమ్మకష్టం వృధా కాకూడదని భావించాను. కొంతమంది పెద్దల సూచనలతో చీరాల గ్రంథాలయంలో రోజు పుస్తకాలు చదవడం ప్రారంభించాను. కష్ట పడ్డాను. దీంతో ఇటీవల ఏపీ ఎస్పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను. లైబ్రరీతో చక్కని ప్రయోజనం ఉంది. ఇంకా సౌకర్యాలు మెరుగు పరిస్తే యువకులకు ప్రయోజనం.

- బలగం వెంకటేష్, వాడరేవు

**నా జీవితంలో చక్కని అవకాశం**



అమ్మా, నాన్న కూలీ నాలీచేసి చదివించారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని అనుకున్నాను. అయితే శిక్షణ పొందేందుకు ఆర్థిక లేమి వెంటాడింది. అయితే వ్యక్తిగత క్రమశిక్షణతో చీరాల శాఖ గ్రంథాలయానికి పాఠకునిగా మారాను. ప్రతి అంశంపై తరువుగా దృష్టి సారించాను. దీంతో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందాను. లైబ్రరీ నా జీవితంలో ఓ మధుర జ్ఞాపకం. అయితే వసతులు మెరుగు పరిస్తే ఎంతోమంది యువతీ యువకులకు లైబ్రరీ ఉపయోగపడుతుంది.

- దాసరి నవీన్, చీరాల

**పోటీ పరీక్షల పుస్తకాలు లేక కొన్నిసార్లు ఇబ్బందులు**



పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి ఎప్పటికప్పుడు కాంపిటేటివ్ బుక్స్ చదవాల్సి ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా ఇక్కడ లైబ్రరీలో పుస్తకాలు చదివేందుకు కొంతకాలం రోజు పర్చూరు నుండి వచ్చాను. అయితే దూరాభారంతో స్థానికంగానే గదిని అద్దెకు తీసుకుని లైబ్రరీలో పుస్తకాలు చదివాను. ఇక్కడ జనరల్ నాలెడ్జ్, కాంపిటేటివ్ పుస్తకాలు ప్రయోజనాన్ని ఇచ్చాయి. అయితే కొన్నిసార్లు అప్‌డేట్ పుస్తకాలకు అగచాట్లు తప్పలేదు. గ్రంథాలయానికి దాతలు సహకరించడంతో పరిస్థితి చక్కబడింది.

- సాయికుమార్, పర్చూరు

# ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యకు పరిష్కారం

● ఏడేళ్లుగా ఎదురు చూసిన వారికి ఎట్టకేలకు పరిష్కారం
● మంత్రి గొట్టిపాటి చొరవకు రైతుల కృతజ్ఞతలు



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో మిన్నేకల్లు రైతులు అధికారులు

సంతమాగులూరు ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిన్నేకల్లు గ్రామంలోని వ్యవసాయ బోర్లకు ప్రభుత్వం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చింది. ఏడేళ్లగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పరిష్కారం లభించిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిన్నేకల్లు గ్రామానికి చెందిన 25 మంది రైతులు తంగేడుమల్లి మేజర్ చివరి ఆయకట్టులో భూములు ఉన్నాయి. ఇక్కడకు సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో రైతులే వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం వీరు ఏడేళ్లగా అధికారులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగారు. దీంతో చేసేది లేక బోర్లలోని నీటి ట్రాక్టర్ల జనరేటర్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారా తోడుకొన్నారు. దీంతో ఏటా ఒక్కో ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు అదనపు ఖర్చు వస్తోంది. దీంతో ఈ విషయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడారు. మొత్తం 2.5 కిలోమీటర్ల నూతన లైన్ ఏర్పాటు చేయడం, లోవోల్టేజీ రాకుండా ఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని గుర్తించారు. ఆ మేరకు రూ. 30 లక్షల మేర ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 మంది రైతుల దరఖాస్తు చేసుకోగా, రైతులకు ప్రభుత్వం ఇంత మొత్తం వెచ్చించే అవకాశం లేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి ఆమోదింపజేశారు. ప్రతి రైతు కేవలం తన వాటాగా రూ.6,200 డీడీ ద్వారా తీసుకొన్నారు. మిగిలిన నిధులను ప్రభుత్వం వెచ్చింది. విద్యుత్ శాఖ అద్దంకి డీఈ నల్లూరి మస్తాన్‌రావు, సంతమాగులూరు ఏఈ దీపక్ రెడ్డిల పర్యవేక్షణలో రెండున్నర నెలల కాలంలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు, ట్రాన్సార్మర్ల అమర్చి పనులు పూర్తి చేశారు. వ్యవసాయ సీజన్‌కు ముందే విద్యుత్‌సరఫరా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడాదినోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలు గుంటూరులో సోమవారం నుంచి గురువారం వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు వేటపాలెం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు ఎంపికయ్యారు. వాలీబాల్ విభాగంలో గాయత్రి, బిందు, కబడ్డీ పోటీలకు షేక్ నస్రీన్, ఎల్ వైష్ణవి ఎంపికయ్యారు. బాపట్లలో శుక్రవారం ఆ మేరకు జరిగిన సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ చాటారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సరోజని, వ్యాయామ ఉపాధ్యాయులు దేవభిక్షం, శ్రావణి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

### గోతుల రోడ్డులో ట్రాక్టర్ బోల్తా

● బల్లికురవ-మార్టూరు రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం



మార్టూరు-బల్లికురవ మధ్య గోతిలో పడిన ట్రాక్టర్

బల్లికురవ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోతులలో అదుపు తప్పి క్రషర్ల వైపు నంచి మార్టురు వైపు వెళుతున్న ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. బల్లికురవ నుండి మార్టురు వెళ్లే అర్‌అండ్‌బీ రోడ్డు నాలుగు కిలోమీటర్ల మేర పూర్తిగా దెబ్బతింది. శుక్రవారం స్టోన్‌క్రషర్ల నుంచి ముక్కలోడ్‌తో మార్టురు వెపు వెళుతున్న ట్రాక్టర్ నక్కబొక్కలపాడు గ్రామ పోలిమేర డొంక సమీపంలో ట్రక్కు టైరు గోతిలో పడింది. దీంతో ఒక్కసారిగా అదుపు తప్పి నడిరోడ్డుపై ట్రక్కు బోల్తా కొట్టింది. దీంతో బల్లికురవ మార్టురు రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గ్రానైట్ ముడిరాయి లారీల రాక పోకలు నిలిచి పోయాయి. తరచు గోతుల దెబ్బకు రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

# నీటి నిల్వలు లేకుండా అవగాహన కల్పించండి

ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ఎంపీడీవో సింగయ్య



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

అద్దంకిటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నీటి నిల్వలు, వాటి వలన వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతి శుక్రవారం నీటిపాత్రలను ఎండబెట్టుకోవాలని తద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ తగిన సూచనలు చేయాలన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా జ్వర బాధులను సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో ఆర్‌వీఎస్ ప్రసాదరావు, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యంమత్తులో వెనక్కు కట్టెలపై పడి మృతిచెందిన ఘటన వేటపాలెం మండలంలోని అనుమల్లిపేటలో శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తన్నేపల్లి జగదీష్(48) రోజువారీ కూలీ. ఈక్రమంలోనే మద్యం సేవించి ఆ మత్తులో ఇంటి పరిసరాల్లో ప్రమాదవశాత్తు జారివెనుక వైపు ఉన్న కట్టెలపై పడ్డాడు. దీంతో తలకు వెనుక భాగంలో కట్టెలు గుచ్చుకొని అక్కడిక్కడే మృతిచెందాడు. ఘటనపై వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

### వైద్యఖర్చుల నిమిత్తం ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీలను అందుకుంటున్న బాధితులు

మార్టూరు, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పేదకుటుంబాలకు చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు వైద్యఖర్చులు నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నిధులు రూ.6 లక్షలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. అందుకు సంబంధించి, ఒక్కొక్కరికి రూ.2 లక్షల నిధులు మంజూరు కాగా, వాటి ఎల్‌వోసీలను శుక్రవారం మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో బాధితులకు కార్యాలయ ప్రతినిధులు అందజేశారు. వారిలో పర్చూరు మండలం గోరంట్లవారిపాలేనికి చెందిన తొండెపు పార్వతమ్మ, యద్దనపూడి మండలం జాగర్లమూడికి చెందిన మొరస తిరుపతిరాయుడు, మార్టూరు మండలం డేగరమూడికి చెందిన దాసరి గాయత్రికి సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వెంకట్, అఖిల్‌లు పాల్గొన్నారు.

### ట్రస్ట్ బోర్డు నియామకానికి నోటిఫికేషన్



ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం

అద్దంకి, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ట్రస్ట్‌బోర్డు నియామకానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. 11 మంది సభ్యుల నియామకానికి 20 రోజులలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దేవాదాయశాఖ అధికారులు పరిశీలించి, ట్రస్ట్‌బోర్డు సభ్యుల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా ఇప్పటికే చుండూరి మురళీసుధాకర్‌రావు పేరు దాదాపు ఖరారు కాగా వివిధ సామాజిక వర్గాల నుండి సభ్యుల నియామకం చేపట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తికావడంతో ఆశావాహులు ట్రస్ట్‌బోర్డు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు.

### అదనపు క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

అద్దంకి, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకునే గడువును డిసెంబర్ 31 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు అద్దంకి డివిజన్ విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మార్చి 2025 నుండి జూన్31 వరకు అద్దంకి డివిజన్‌లో 2982 సర్వీసులు అదనపు లోడు క్రమబద్ధీకరించుకున్నారన్నారు. దీని ద్వారా రూ.90 లక్షలు విద్యుత్‌శాఖకు వచ్చాయన్నారు. 50 శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని మిగిలిన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు




బల్లికురవలో రేణుకమ్మ దేవాలయం వద్ద పూజలు, కూకట్లపల్లిలో పూజల్లో పాల్గొన్న మహిళలు

బల్లికురవ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మహిళ భక్తులు ప్రతి ఇంట రంగవల్లులతో ఆలంకరించి గృహాలకు తోరణాలు కట్టి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజలలో పాల్గొన్నారు. కూకట్లపల్లి గ్రామంలో రామలయం సమీపంలోని మహలక్ష్మీ చెట్టు వద్ద లలితా పరమేశ్వరి అమ్మవారి కుంకుమపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. బల్లికురవ గ్రామంలోని పావులూరి వంశస్థుల ఇలవేల్పు అయిన రేణుకమ్మ దేవాయలంలో వరలక్ష్మీ వ్రతంను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

**శ్రావణ శుక్రవారం పూజలు**

అద్దంకి : శ్రావణమాసం శుక్రవారం పూజలను అద్దంకి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. హోమం నిర్వహించారు. 108 మంది మహిళలతో కుంకుమ పూజను నిర్వహించారు.

**15న శింగరకొండలో వరలక్ష్మీ వ్రతాలు**


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 15న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు 10వ తేదీ లోపు దేవస్థానంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

**గ్రామగ్రామాన వరలక్ష్మీ వ్రతాలు**

పంగులూరు : పౌర్ణమికి ముందువచ్చే లక్ష్మీ శుక్రవారాన్ని పురష్కరించుకుని మహిళాభక్తులు ఆలయాలలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఉపవాస దీక్షను చేపట్టిన మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం ఆచరించి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకూరు గ్రామకొండపై కొలువుదీరిన శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి సన్నిధిలో పలువురు మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి వెంకటేష్ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేటపాలెం(చీరాల) : వేటపాలెం మండలం అనుమల్లిపేటలో వేంచేసిన శ్రీమహాలక్ష్మీ చెట్టు మందిరం వద్ద శ్రావణమాసం సందర్భంగా భక్తులు ఘనంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ క్రమంలోనే అమ్మవారిని నగదుతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే నూతన నాణ్యములు సమర్పించారు. దీంతో ఉదయం నుంచే భక్తులు విశేషంగా పాల్గొని ఉత్సాహంగా పూజలు చేశారు.





అద్దంకిలో అమ్మవారికి స్వర్ణ కవచ అలంకరణ, రామకూరు కొండపై పూజలు, ధనలక్ష్మిగా అమ్మవారు